



పనులకు శంకుస్థాపన చేసిన మంత్రి బుగ్గన, చిత్రంలో ఎమ్మెల్యే హాఫీజ్ ఖాన్, మేయర్ బివై రామయ్య, జిల్లా కలెక్టర్ డాక్టర్ సృజన, జడ్పి చైర్మన్ పాపిరెడ్డి, డిఆర్ఒ, తదితరులు

వెంటాడుతున్న ఎర్రతెగులు, వర్షాభావం

- భారీగా నష్టపోతున్న పత్తి రైతు
- ప్రభుత్వం ఆదుకోవాలంటున్న అన్నదాతలు



ప్రజాశక్తి-పత్తికొండ

ఎర్రతెగులు, వర్షాభావం పత్తికొండ మండల పత్తిపైరును వెంటాడుతున్నాయి. మొక్కగిడసబారి ఎదుగుదల ఆగిపోయింది. పత్తిచేనును దున్నేసి ప్రత్యామ్నాయం వెతుకుతున్నారు. మొత్తం 6905 ఎకరాలలో 1300 ఎకరాలతో ఎర్రతెగులుతో గిడసబారిన పత్తిచేనును రైతులు దున్నేశారు. ఈ ఏడాది భారిగా నష్టం జరిగే అవకాశం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. పెట్టుబడి బూడిదలో పోసిన పన్నీరు చందంగా మారిందని రైతులు అంటున్నారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి రైతును ఆదుకోవాలని కోరుతున్నారు. ఈనేపథ్యంలో పత్తికొండ మండలంలో ఖరీఫ్ సాగుపై ప్రత్యేక కథనం.... రైతులు ఎన్నో ఆశలతో ఈ ఏడాది ముందస్తుగా ఖరీఫ్ సీజన్‌లో పత్తి సాగు చేశారు. రైతులకు కన్నీళ్లు తప్పడం లేదు. వాతావరణం అనుకూలించక పోయినప్పటికీ భూమిలో విత్తనం వేయక తప్పదని, ఆశతో పంటలను సాగు చేశారు. పత్తికొండ మండలంలో ఖరీఫ్ సీజన్‌లో జూన్ మొదటివారం, జులై ఆఖరి వారంలో అరకొర వర్షాలకు రైతులు పత్తి, ఆముదం, టమోటా, సజ్జ, కంది తదితర పంటలను ఎకరాకు రూ.15వేల నుంచి రూ.20వేల పెట్టుబడి పెట్టి పంటలను సాగు చేశారు. మండలంలో గతేడాది 19,500 ఎకరాలలో పత్తి సాగు చేశారు. ఈ ఏడాది కేవలం 6905 ఎకరాలలో మాత్రమే పత్తి సాగు చేశారు. గత ఏడాదితో పోల్చుకుంటే ఈ ఏడాది 50 శాతంపైగా పత్తి సాగు తగ్గింది. మార్కెట్లోని జాదు సదానంద రాశి ,ధర్మ గోల్డ్, చందన గోల్డ్, భక్తి నందిని, కావేరి తులసి , నవనీత్ ,జంగి ,వేద సీడ్స్, డి, జోడి, డిజె పలు రకాల పత్తి విత్తనాలను పంటలు ఎదుగుదల లేకపోవడంతో రైతు దిక్కుతో స్థితిలో ఉన్నారు. మండల పరిధిలోని పత్తికొండ, హోసూరు ,పెద్దహుల్తి, చిన్నహుల్తి, పందికోన కొత్తపల్లి, మందిగిరి అగ్రహారం జూటూరు దూదెకొండ గ్రామాలలో పత్తిని రైతులు అత్యధికంగా సాగు చేశారు. వర్షాభావం ఒకటైతే మొక్క ఎదుగుదల లేక తెగులతో పంటలను తొలగించామని రైతుల ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మండలంలో ఇప్పటివరకు సుమారుగా 1300 ఎకరాల్లో పత్తి పంటను తొలగించినట్లు సమాచారం. వ్యవసాయ అధికారులు సకాలంలో సూచనలు సలహాలు ఇవ్వడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షాలు లేక కొందరు రైతులు పంటలు వేయక అలాగే ఉండిపోయారు. పంటవేసిన రైతులకు మాత్రమే ఈ క్రాప్ బుకింగ్ చేస్తున్నామని అధికారులు చెబుతున్నారు. వేయని వారి పరిస్థితి ఏమిటని , పంట వేసి తొలగించిన వారి పరిస్థితి ఏమిటి రైతులు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు పునరాలోచించాలని, తెగుళ్ళ, వర్షాభావంతో నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

పత్తి పంటను తొలగించా..

- యువ రైతు బోయ శ్రీరాములు..

హోసూరు గ్రామ పరిధిలో 860 , 862 సర్వే నంబర్లు 4.50 ఎకరాలలో పత్తిని సాగు చేశాను. మొక్కదశలోని ఎదుగుదల లేక ఎర్ర తెగులు రావడంతో గిడసబారటంతో పంటను దున్నేసి తొలగించాను. రూ.40 వేల నష్టం వాటిల్లిందని ఆవేదన వ్యక్తం చేశారు.

పత్తి రైతుకు న్యాయం చేయాలి

- రైతు సంఘం మండల కార్యదర్శి సిద్దయ్య గౌడ్



పత్తికొండ మండలంలోని జూన్, జులైలో కురిసిన అరకొర వర్షాలకు పత్తి పంట వేసి తొలగి ంచిన రైతులకు కూడా ఈ క్రాప్ బుకింగ్ చేసి నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. పొలం లో పంట ఉంటేనే ఈ క్రాప్ చేస్తామని చెప్పడం అన్యాయం. న్యాయం చేయకపోతే రైతులను కలుపుకొని పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామన్నారు.

జిల్లా ఉన్నతాధికారులు దృష్టికి తీసుకెళ్తాం

- మండల వ్యవసాయాధికారి వెంకట్రాముడు



జూన్,జులైలో పత్తి పంట ను వేసి నష్టపోయిన రైతులు ,,పత్తి సాగుచేసి తొలగించిన ఆధారాలు ఏవైనా ఉంటే రైతు భరోసా సిబ్బందికి సమాచారం ఇవ్వాలన్నారు. జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకుపోతామని అన్నారు.

కలెక్టరేట్ ఆధునీకరణకు రూ 8.08 కోట్లు

పనులకు శంకుస్థాపన చేసిన మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

కలెక్టరేట్ భవన మరమ్మతుల ఆధునికరణకు నిమిత్తం రూ.8.08 కోట్ల నిధులు మంజూరు చేయడం చేశామని ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి వెల్లడించారు.సోమవారం కలెక్టరేట్ కార్యాలయ పునరుద్ధరణ నిమిత్తం రహదారులు , భవనాల శాఖ ఆధ్వర్యంలో చేపడుతున్న పనులకు జి మంత్రి, జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల బాపిరెడ్డి, జిల్లా కలెక్టర్ డాక్టర్ జి సృజన ఎమ్మెల్యే హాఫీజ్ ఖాన్ మేయర్ రామయ్యలు శంకుస్థాపన చేపట్టారు. కలెక్టరేట్ భవనం నందు వర్ష కాలంలో నీరు కారకుండా లీక్ ప్రూఫ్ పనులు, భవనంలో ఉన్న అన్ని టాయిలెట్స్ పునరుద్ధరణ, పాడైపోయిన కిటికీలను తొలగించి యుపివిసి కిటికీలు అమర్చుట, సన్ షేడ్స్, అవసరమైన చోట ఫ్లోరింగ్, సునయన ఆడిటోరియం సీటింగ్, సౌండ్ ప్రూఫ్, సౌండ్‌సిస్టం, ఫ్లోరింగ్, ఫాల్‌సీలింగ్, ఏసి ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. సదరు మరమ్మతులను నాణ్యతతో నిర్మించి ఉద్యోగులకు ఉపయుక్తంగా ఉండేలా భవనాన్ని సవరించేలా చర్యలు తీసుకోవాలని మంత్రి కలెక్టర్‌కు సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి నాగేశ్వర రావు, ఆర్ అండ్ బి ఎస్ఇ నాగరాజు, ఇఇ సురేష్ బాబు, డిఇ రవిచంద్ర, 17వ వార్డు కార్పొరేట్ పద్మలత, ఆర్ అండ్ బి సిబ్బంది, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మంత్రి బుగ్గన , చిత్రంలో ఎమ్మెల్యేలు చెన్నకేశవరెడ్డి, బాలనాగిరెడ్డి, కలెక్టర్ సృజన, జడ్పి చైర్మన్

సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లు

- ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

సంక్షేమం, అభివృద్ధిని రెండు కళ్ళుగా రాష్ట్ర ప్రభుత్వం ముందుకు తీసుకెళ్తోందని రాష్ట్ర ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి పేర్కొన్నారు. సోమవారం ఎమ్మిగనూరు మున్సిపల్ కౌన్సిల్ హాల్‌లో ఎమ్మిగనూరు, మంత్రాలయం నియోజక వర్గాల స్థాయి అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలపై ఎమ్మెల్యేలు, జిల్లా, నియోజకవర్గ స్థాయి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి బుగ్గన మాట్లాడుతూ అనుమ తులు వచ్చిన వెంటనే కర్నూలులో హైకోర్టు నిర్మిస్తామని, ఆ దిశగా ప్రయత్నాలు చేస్తున్నామని తెలిపారు. కర్నూలు జగన్నాథ్ గట్టుపై జ్యూడిషియల్ సిటీ, లా యూనివర్సిటీకి త్వరలో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డితో భూమిపూజ చేయిస్తామని మంత్రి తెలిపారు. ప్రతిపక్ష నాయకుడు చంద్రబాబు అసత్యాలు ప్రచారం చేస్తున్నాడని ఆరోపించారు. తాము చేసే సంక్షేమ పథకాలు సరికాదంటూ తాను అదే అమలు చేస్తానని అంటు న్నాడని ఆదేమిటని అడిగితే సంపద సృష్టిస్తానని చెపుతున్నాడని అన్నారు. చంద్రబాబు పాలనలో రాబడి కంటే వైసిపి పాలనలో రాబడి ఎక్కువగా ఉందని, చంద్రబాబు లెక్కలు తెలుసుకొని మాట్లాడాలని అన్నారు. 2014 నుండి 19 వరకు చంద్రబాబు పాలనలో 6 శాతం రాబడి రాగా వైసిపి పాలనలో 21 శాతం రాబడి వచ్చిందన్నారు. ప్రజలు చంద్రబాబు పాలన.. జగన్ పాలనలో తేడాను గుర్తించాలన్నారు. జిల్లాలో అవసరమైన పనులను గుర్తించి పూర్తిచేస్తామన్నారు. జిల్లాలో జరిగిన అభివృద్ధి ప్రతిపక్షాలకు కనపడడం లేదన్నారు. నియోజకవర్గాల్లో తాగు, సాగునీరు, ఇతర సమస్య లపై శాఖల వారీగా చర్చించారు. ఈ కార్యక్రమ ంలో ఎమ్మిగనూరు ఎమ్మెల్యే ఎర్రకోట చెన్నకేశవ రెడ్డి, మంత్రాలయం ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి, జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన, నియోజకవర్గం సీనియర్ నాయకులు ఎర్రకోట జగన్మోహన్ రెడ్డి, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

సమావేశం వద్ద విద్యార్థి సంఘాలు ఉద్రిక్తత

సమావేశం దగ్గర కాసేపు ఉద్రిక్తత పరిస్థితి నెలకొంది. సంక్షేమ హాస్టళ్లకు పక్కా భవనాలకు నిధులు కేటాయించాలని డిమాండ్ చేస్తూ ఐక్య విద్యార్థి సంఘం నాయకులు గేటు దగ్గర చొచ్చుకెళ్లే ప్రయత్నం చేయగా పోలీసులు అడ్డుకుని స్టేషన్‌కు తరలించారు.

బీడీ కార్మికుల హౌసింగ్ కాలనీలో మౌలిక వసతులు కలిపించాలి

-అవాజ్ కమిటీ ఆధ్వర్యంలో డిఆర్ఒకు వినతి

ప్రజాశక్తి-కర్నూలు అగ్రికల్చర్



డిఆర్ఒకు వినతి పత్రం ఇస్తున్న ఆవాజ్ కమిటీ నాయకులు

కర్నూలు నగరంలోని జొహరాపురం దగ్గర గల బీడీ వర్కర్స్ హౌసింగ్ కాలనీలో మౌలిక వసతులు కల్పించాలని, ఆవాజ్ కమిటీ నగర అధ్యక్ష ,కార్యదర్శులు పి.ఇక్బాల్ హుస్సేన్ ,మొహమ్మద్ షరీఫ్‌లు సోమవారం ప్రజాస్పందనలో డిఆర్ఒ నాగేశ్వరరావుకు వినతిని అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కర్నూలు నగరంలోని జొహరాపురం దగ్గర గల బీడీ కార్మికులు హౌసింగ్ కాలనీలో మురుగు కాలువలు , సిసిరోడ్లు ,వీధిదీపాలు లేకపోవడంతో, అక్కడి ప్రజలకు తీవ్రమైన ఇబ్బందులు కలుగుతున్నాయన్నారు. కొన్ని ప్రాంతాలలో కంప చెట్లు ముళ్లపదలు పెరిగిపోయి, పాములు, తేళ్లు, విషపురుగులు, క్రిమి కీటకాలు తిరుగుతా ఉన్నాయని పేర్కొన్నారు. చీకటి పడితే బయటికి రావడానికి అక్కడి ప్రజలకు తీవ్ర ఇబ్బందులు కలుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అదేవిధంగా అక్కడ నివాసం ఉంటున్న వారందరి ఇళ్లకు పన్నులు, పట్టాలు ఇవ్వాలన్నారు. ప్రభుత్వం తక్షణమే స్పందించిపై సమస్యలను పరిష్కరించాలని కోరారు. లేని పక్షంలో ప్రజలను సమీకరించి ఆందోళన, పోరాటాలు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆవాజ్ కమిటీ నగర నాయకులు మహబూబ్ బాషా, ఫయాజ్‌ఖాద్రి, ఇలియాజ్, మహేమూద్, పాస్టర్, ఫక్రుద్దీన్,అన్వర్, ఎండినబి,బాష, దావూద్ , ఎండి హనీఫ్, రియాజ్ , ఫారుక్‌బాషా, అబ్దుల్ రసూల్‌లతోపాటు మరో 25 మంది దాకా పాల్గొన్నారు.

కె.నాగలాపురం,పెంచికల పాడు చెరువును కాపాడండి

సిపిఎం ఆధ్వర్యంలో రిలే దీక్షలు ప్రారంభం - టిడిపి సంఘీభావం

ప్రజాశక్తి-గూడూరు



మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు కె. ప్రభాకర్ రెడ్డి

కె.నాగలాపురం, పెంచికల పాడు గ్రామాల మధ్య ఉన్న చెరువును అన్యాక్రాంతమవు తున్నందున సిపిఎం ఆధ్వర్యంలో కె.నాగలాపురం పెంచికల పాడు గ్రామాల ప్రజలతో సోమవారం రిలే దీక్షలు చేపట్టారు. ఈ రిలే దీక్షలకు సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు కె.ప్రభాకర్ రెడ్డి దీక్షలను ప్రారంభించి మాట్లాడారు. టిడిపి జిల్లా అధ్యక్షుడు ఎమ్మెల్సీ బిటి. నాయుడు టిడిపి మాజీ నియోజకవర్గ ఇన్చార్జి విష్ణువర్ధన్‌రెడ్డి, టిడిపి నియోజకవర్గ ఇన్చార్జి ఆకే పోగు ప్రభాకర్ సంఘీభావం తెలిపారు. సిపిఎం గూడూరు మండల కార్యదర్శి జె.మోహన్‌లు, కోడుమూరు, సిబెళగల్,కర్నూల్, గూడూరు మండలాల్లోని సర్పంచులు, ఎంపిటిసిలు, నాయకులు హాజరయ్యారు. దీక్షలను ఉద్దేశించి సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కె.ప్రభాకర్ రెడ్డి మాట్లాడారు. నాగలాపురం చెరువు కట్టను అక్రమంగా తెంపి ఆక్రమించు కోడానికి చూస్తున్న వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలన్నారు. చెరువు కట్టను తెంపడంతో పెంచికాల పాడు గ్రామంలోకి నీరు వెళ్లే ప్రమాదం ఉందన్నారు. చెరువుకట్ట తెంపి ఆక్రమించుకుంటున్నా రెవిన్యూ అధికారులు, ఇరిగేషన్ అధికారులకు కనబడటం లేదా అన్నారు. అధికారుల నిర్లక్ష్యం కనబడుతుందని,చెరువు కట్టను తిరిగి నిర్మించేందుకు దీక్షలను కొనసాగిస్తామన్నారు. దీక్షలతో పరిష్కారం కాక పోతే పెద్దయెత్తున ఆందోళన కార్యక్రమాలు చేడుతామని హెచ్చరిం చారు. దీక్షలో కూర్చున్నావారు, నాగలాపురం సర్పంచి నాయో మి,పెంచికళ పాడు సర్పంచి భాస్కర్ రెడ్డి, నాగలాపురం సిపిఎం కార్యదర్శి రవి, వార్డ్ మెంబర్లు, నాయకులు కూర్చున్నారు.



దీక్షలను ఉద్దేశించి మాట్లాడుతున్న పాణ్య నియోజకవర్గ ఇన్‌ఛార్జి గౌరుచరిత

రైతు కుటుంబాలను ఆదుకోవాలి : గౌరుచరిత

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

రాష్ట్రవ్యాప్తంగా ఆత్మహత్యకు పాల్పడిన రైతు కుటుంబాలను ముఖ్యమంత్రి ఆదుకోవాలని టిడిపి పాణ్యం ఇన్చార్జి గౌరు చరిత డిమాండ్ చేశారు. ఈ మేరకు టిడిపి నంద్యాల జిల్లా అధ్యక్షులు మల్లెల రాజశేఖర్ ఓర్వకల్లులో చేపట్టిన నిరసన దీక్ష శిబిరాన్ని గౌరు చరిత సందర్శించి సంఘీభావం తెలిపారు. ఆమె మాట్లాడుతూ జగన్ పాలనలో వ్యవసాయం సంక్షోభంలో పడిందని అన్నారు. రైతులు అప్పులపాలై ఆత్మహత్యలు చేసుకుంటున్నా జగన్‌కు కనిపించడం లేదన్నారు. టిడిపి హయాంలో చంద్రబాబు పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేసి ప్రతి వర్షపు నీటి బొట్టును ఒడిసి పట్టి రాయలసీమకు తాగు సాగునీటి అవసరాలను తీర్చారని అన్నారు. చంద్రబాబు హయాంలో సాగు నీటి ప్రాజెక్టులు 80 శాతం పూర్తి చేస్తే సీఎం జగన్ మిగిలిన 20 శాతం పనులు కూడా పూర్తి చేయలేదని అన్నారు. ఈ కార్యక్రమం లో టిడిపి జిల్లా ఉపాధ్యక్షులు మోహన్‌రెడ్డి, నియోజకవర్గ వాణిజ్య విభాగం అధ్యక్షులు బ్రహ్మణపల్లె నాగిరెడ్డి, ఓర్వకల్ మండల అధ్యక్షులు గోవింద్ రెడ్డి, కల్లూరు మండల అధ్యక్షుడు డి.రామాంజనేయులు, వివిధ గ్రామాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు

ఆఫీసు తలుపు తడితే ఆదుకుంటా

-రాజకీయాల కోసం మీగడప వద్దకు రాలేదు
-కర్నూలు ఎమ్మెల్యే ఎంఏ.హఫీజ్ ఖాన్

ప్రజాశక్తి- కర్నూలు క్రైమ్



సమస్యలు తెలుసుకుంటున్న హఫీజ్‌ఖాన్

ఈ కష్టమొచ్చినా నా కార్యాలయ తలుపు తడితే చాలు ఆదుకుంటానని కర్నూలు ఎమ్మెల్యే ఎంఏ. హఫీజ్ ఖాన్ అన్నారు. సోమవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని 45వ వార్డ్ 118వ సచివాలయం పరిధిలో ఉన్న భగత్ సింగ్ నగర్, కప్పల్ నగర్ వీధుల్లో నిర్వహించారు. వీధిలో ఉన్న ప్రతి ఇంటింటికి వెళ్లి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదల ఆర్థికాభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ పథకాలు అమలు చేస్తోందని ఎమ్మెల్యే హాఫీజ్ ఖాన్ అన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆర్థికాభివృద్ధితోనే పేదల బతుకులు మారుతాయని చెప్పారు. ఈ ఉద్దే శంతోనే ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రతి ఇంటికి సంక్షేమ పథ కాలు పారదర్శకంగా అమలు చేస్తున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో 45వ వార్డువైసిపి నాయకులు, జిల్లా ఎస్‌సి, ఎస్‌టి విజిలెన్స్ అండ్ మోనిటరింగ్ కమిటీ సభ్యులు ప్రభుదాస్, జిల్లా యూత్ ప్రెసిడెంట్ సితార ఇర్ఫాన్ పాల్గొన్నారు.

10వ వార్డులో గుండె వ్యాధులకు ఉచిత వైద్య శిబిరం


కర్నూలు ఎమ్మెల్యే హాఫిజ్‌ఖాన్ నగరం లోని మాసూమ్‌బాషా దర్గాలో 10వ వార్డ్ కార్పొరేటర్ యూనుస్‌బాషా ఆధ్వర్యంలో ఆయన తండ్రి షైక్ సలాం 2వ వర్ధంతి సందర్భంగా సోమవారం కిమ్స్ హాస్పిటల్ వారి సౌజన్యంతో ఉచిత మెడికల్ క్యాంపు నిర్వహించారు. కర్నూలు ఎమ్మెల్యే హాఫీజ్ ఖాన్ ముఖ్యఅతిథిగా విచ్చేసి క్యాంపును ప్రారంభించారు. మెడికల్ క్యాంపులో ఇసిజి, షుగర్ టెస్ట్, 2డి ఎకో, ఉచిత కన్సల్టేషన్, బిపి, ఆరోగ్యానికి సంబంధించిన తదితర పరీక్షలు ఉచితంగా నిర్వహించారు. ఎమ్మెల్యేకు స్థానిక వార్డ్ నాయకులు ఘనంగా స్వాగతం పలికారు. కార్పొరేటర్లు యూనుస్ బాషా, ఫారజ్ ఖాన్, పర్వేజ్ ఖాన్, రైల్వే ప్రసాద్, ప్రముఖ దంత వైద్య నిపుణులు రేహన్ అలీ ఖాన్, నజీర్‌అలీ ఖాన్, ఫైసల్ ఖాన్, హకీమ్‌భాయ్, సోహైల్‌బాబా, షబ్బీర్‌ఖాన్, అఖిల్‌అలీఖాన్, ఫరూక్ భాయ్, జావీద్, అంజాద్, ఇమ్రాన్, అమీర్, రియాజ్, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.



చట్టపరంగా న్యాయం చేస్తాం : ఎస్‌పి

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో వచ్చిన ఫిర్యాదులపై చట్టపరంగా విచారణ జరిపి న్యాయం చేస్తామని ఎస్‌పి జి.కృష్ణ కాంత్ అన్నారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి స్పందనకు వచ్చిన ప్రజల సమస్యల వినతులను స్వీకరించి ఫిర్యాదు దారులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. స్పందన కార్యక్రమానికి ఈ రోజు మొత్తం 96 ఫిర్యాదులు వచ్చాయి. స్పందనకు వచ్చిన ఫిర్యాదులన్నింటిపై చట్ట ప్రకారం విచారణ జరిపి, బాధి తులకు న్యాయం చేస్తామన్నారు. సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. డిఎస్‌పి శ్రీనివాసులు , సిఐలు పాల్గొన్నారు.



బాధిత రైతు కుబుంబసభ్యులతో మాట్లాడుతున్న అధికారులు

రైతు ఆత్మహత్యపై కమిటీ దర్యాప్తు

ప్రజాశక్తి-సి బెళగల్

సి బెళగల్ మండలం యనగండ్లలో ఈ నెల19న అప్పుల బాధ తాళలేక రైతు శ్రీకృష్ణదేవరాయలు ఆత్మహత్యకు పాల్పడ్డారు. సోమవారం మండల కమిటీ ఆత్మహత్యకు వివరాలు సేకరణలో భార్య రంగమ్మతో దర్యాప్తు చేపట్టి ఏఏ పంటలు సాగు చేసేవారని, అప్పులభారంపై తగు నివేదిక తయారు చేసినట్లు తహసీల్దార్ శేషఫణి, ఎఒ మల్లేష్ కుమార్ తెలిపారు.

శాస్త్రీయతను పెంపొందించాలి

జెవివి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులుగా బిడి.సుధీర్ రాజు, ఖాజా హుస్సేన్

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్





నేటి సమాజంలో విద్యార్థులకు శాస్త్రీయ దక్పథాన్ని పెంపొందించాలని జన విజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షుడు బిడి.సుధీర్ రాజు అభిప్రాయం వ్యక్తం చేశారు. ఈనెల 20న నిర్వహించిన జెవివి జిల్లా మహాసభలో సుధీర్‌రాజు అధ్యక్షులుగా, ఖాజా హుస్సేన్ ప్రధాన కార్యదర్శిగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా సోమవారం సుధీర్‌రాజు విలేక రులతో మాట్లాడుతూ ప్రస్తుత సమాజం మూఢనమ్మకాలతో నడుస్తుందన్నారు. ఇలాంటి భ్రమల నుండి ప్రజలను తొలగించేందుకు జన విజ్ఞానం వేదిక ద్వారా అవగాహన కార్యక్రమాలను నిర్వహించి చైతన్యం చేస్తామన్నారు. శాస్త్ర సాకేతిక రంగాల్లో దూసుకు వెళ్తున్న ఈ తరుణంలో ప్రజలను శాస్త్రీయ సమాజ నిర్మాణంవైపు అడుగులు వేసేలా చర్యలు తీసుకుంటామని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా సుదీర్ రాజుకు ప్రభుత్వ ఐఎఎస్ఇ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఆర్ ఆదినారాయణ రెడ్డి లెక్చరర్లు రఫిక్ వనం రాజుకు అభినందనలు తెలిపారు.

మనిషికి వృద్ధాప్యం శాపం కాకూడదు

-ప్రతి ఒక్కరూ ఆదరించాలి
-ప్రముఖ గ్యాస్ట్రో ఎంట్రాలజిస్ట్ డాక్టర్ శంకర శర్మ

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్



వృద్ధులకు నిత్యావసర వస్తువులు పంపిణీ చేస్తున్న డాక్టర్ శంకర శర్మ

ప్రతి మనిషి జీవితంలో వృద్ధాప్యం అన్నది తప్పనిసరిగా వస్తుందని, అయితే వృద్ధాప్యం ఎవరికి శాపంగా మారకూడదని ప్రముఖ గ్యాస్ట్రో ఎంట్రాలజిస్ట్ డాక్టర్ శంకర శర్మ అన్నారు. కర్నూలు మండల పరిధిలోని బి.తాండ్రపాడు గ్రామం వద్ద ఉన్న సెరుడ్స్ వృద్ధాశ్రమంలో జాతీయ వృద్ధాప్య దినోత్సవాన్ని పురస్కరించు కొని డాక్టర్ శంకర్ శర్మ నిత్య వసర వస్తు వులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు జ్ఞానెశ్, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు. డాక్టర్ శంకరశర్మ మాట్లాడుతూ తల్లిదండ్రులు ఎంతో కష్టపడి తమ పిల్లలను పెంచు తారన్నారు. అయితే వారు వృద్ధాప్యంలో చేరినప్పుడు పిల్లలు నిర్లక్ష్యం చేయకుండా ఆదరించాల్సిన అవసరం ఉందని వివరించారు.

వృద్ధాప్యంలో ఉన్నవారికి పలు రకాల ఆరోగ్య సమస్యలు ఉంటాయని, వారిని జాగ్రత్తగా కనిపెట్టుకొని ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూసు కోవాలని సూచించారు. కొన్ని సందర్భాలలో పిల్లలు సుదూర ప్రాంతాలలో ఉండి తల్లిదండ్రులను దగ్గరకి తీసుకోలేని పరిస్థితి ఉంటుందని, మరికొన్ని సందర్భాలలో తల్లిదండ్రులే సుదూర ప్రాంతాలకు వెళ్లకుండా స్వగ్రామాల్లో ఉండేందుకు ఇష్టపడుతున్నారని వివరించారు. ఇలాంటి పరిస్థితుల్లో వృద్ధులకు ఆశ్రయం కల్పించడానికి వృద్ధాశ్రమాలు ఏర్పాటు చేయడం అభినందనీయమని వివరించారు. అయితే వృద్ధాశ్రమాల అవసరం రాకుండా చూడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని చెప్పారు. పలు సమస్యలతో ఉన్న వృద్ధులను చేరదీసి ఆదరించేందుకు వృద్ధాశ్రమాలు ఏర్పాటు చేయడం అభినందనీయ మన్నారు. ఇక్కడ డబ్బు కంటే వృద్ధులకు చేసే సేవలే కీలకమని చెప్పారు. సమాజంలో ప్రతి ఒక్కరూ తమ సంపాదనలో ఎంతో కొంత భాగాన్ని సామాజిక సేవా కార్యక్రమాలకు వినియో గించాలని అప్పుడే నిజమైన సంతప్తి ఉంటుందని చెప్పారు. వృద్ధులను గౌరవించాలన్న ఆలోచనతోనే జాతీయ వృద్ధాప్య దినోత్సవ సందర్భంగా తాను వద్ధాశ్రమానికి నిత్యవసర వస్తువులను పంపిణీ చేశానని, భవిష్యత్తులో కూడా తన సహకారం అందిస్తారని డాక్టర్ శంకర శర్మ స్పష్టం చేశారు. ప్రతి ఒక్కరూ వృద్ధులను ఆదరించాలని మరోసారి ఆయన సూచించారు.

ఎమ్మెల్యే హాఫీజ్ ఖాన్ ప్రజా దర్బార్

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్ : కర్నూలు నగరంలో సోమవారం ఒకటో వార్డులోని రాయల్ ఫంక్షన్ హాలులో ఎమ్మెల్యే ఆఫీస్ ఖాన్ ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని నిర్వహించారు. నలుగురు ప్రజల నుంచి వినతి పత్రాలను స్వీకరించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సంబంధిత అధికారులతో ఫోన్ ద్వారా మాట్లాడి సమస్యను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు.

ఉరుకుందలో శ్రావణ శోభ

- తొలి సోమవారం అధిక సంఖ్యలో భక్తుల సందడి
- అధిక ధరలతో భక్తులు విలవిల...
- అరికట్టడంలో అధికారులు వైఫల్యం

ప్రజాశక్తి - కౌతాళం

శ్రావణమాస ఉత్సవాలలో భాగంగా మొదటి సోమవారం శ్రీ నరసింహ ఉరుకుంద ఈరన్న స్వామి పుణ్యక్షేత్రంలో భక్తుల సందడి నెలకొంది. స్వామివారి దర్శనం కోసం ఆదివారం రాత్రి నుండి భక్తులు బారులు తీరారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకొని స్వామివారి దర్శనం కోసం ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. రాష్ట్రం నుండే కాక కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల నుండి భారీ సంఖ్యలో భక్తులు వచ్చారు. వివిధ ప్రాంతాల నుండి వచ్చిన భక్తులు తుంగభద్ర దిగువ కాలువలో పుణ్య స్థానాలు ఆచరించి, తడి గుడ్డలతోనే స్వామి వారికి ఇష్టమైన నైవేద్యాన్ని వండి పూజలు చేశారు. మరి కొంతమంది భక్తులు తలనీలాలు సమర్పించి మొక్కుబడులు తీర్చుకున్నారు. పాలకమండలి అధ్యక్షులు నాగరాజు గౌడ్, సహాయ కమిషనర్ వాణి స్వామివారి దర్శనం కోసం ప్రత్యేకమైన క్యూలైన్లు ఏర్పాటు చేయడంతో స్వామివారి దర్శనం కోసం ఎక్కువ సమయం పట్టలేదు. ఆదోని, ఎమ్మిగనూర్, రాయచూర్, సిరుగుప్ప డిపోల నుండి భక్తుల కోసం ప్రత్యేక బస్సు సౌకర్యాలు కల్పించారు. పోలీస్ శాఖ వారు ఆదోని, కౌతాళం, కోసిగి, హాల్వి వైపుల నుండి వచ్చే వాహనాలు చెక్ పోస్ట్ ల ద్వారా నియంత్రించి ట్రాఫిక్ సమస్యను భక్తులు ఎదుర్కోకుండా ప్రత్యేకమైన చర్యలు తీసుకున్నారు. దీంతో పుణ్యక్షేత్రం ఆవరణంలో



భక్తులు ఇలాంటి ఇబ్బందులు పడకుండా ఉన్నారు.

శ్రావణమాస ఉత్సవాల కంటే ముందు జిల్లా ఎస్పీ కృష్ణకాంత్, ఆదోని సబ్ కలెక్టర్ అభిషేక్ కుమార్ ఉత్సవాల ఏర్పాట్లను పరిశీలించడం జరిగింది. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని చర్యలు తీసుకోవాలని సూచించారు. ముఖ్యంగా ఉత్సవాలలో అధిక ధరలను నియంత్రించి భక్తులకు సేవలు అందించాలని హెచ్చరించారు. అనంతరం దేవాలయ సహా కమిషన వాణి, ఎస్సై నరేంద్ర కుమార్ రెడ్డి వ్యాపారస్తులతో టెంకాయల విక్రయదారులతో కళ్యాణ కట్టలు పనిచేసే కార్మికులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి అధిక ధరలు విక్రయించరాదని, భక్తుల నుండి డబ్బులు వసూలు చేయరాదని హెచ్చరికలు జారీ చేశారు. అయితే వారి సూచనలు, హెచ్చరికలను మొదటి సోమవారమే బేఖాతరు చేశారని విమర్శలు వినిపిస్తున్నాయి.

జత టెంకాయలు రూ.70 : ఉత్సవాలలో ప్రతి భక్తుడు కొబ్బరికాయ కొట్టడం ఆనవాయితీగా మొక్కుబడిగా ఉంది. ఇదే అదునుగా భావించి విక్రయదారులు అధిక ధరలకు విక్రయించి భక్తుల జేబులకు చిల్లులు పడేలా చేస్తున్నారు. అధిక ధరలకు టెంకాయలు విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. వీరిపై చర్యలు తీసుకోవాలని భక్తులు డిమాండ్ చేస్తున్నారు.

తలనీలాలకు రూ. 100 : శ్రావణమాస ఉత్సవాలకు భక్తులు లక్షల మంది వస్తారు. స్వామివారికి మొక్కుబడి కింద తలనీలాలు సమర్పించడం జరుగుతుంది. చిన్న పిల్లవాడు నుండి ముసలి వాళ్ల వరకు తలనీలలో సమర్పిస్తూ ఉంటారు. తలనీలాలు సమర్పించడానికి రూ.25 రూపాయలు చెల్లించి టికెట్టు తీసుకోవాలని చెబుతున్నా.. రూ. 100 అదనంగా చెల్లించా ల్సిన దుస్థితి నెలకొంది. ఇలా నిలువు దోపిడి చేస్తున్న పట్టించుకునే వారే లేరా అని భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

తలనీలాలకు రూ. 100 చెల్లించాలి

- ఈరన్న, భక్తుడు



తలనీలాలు సమర్పించాలి అంటే వంద రూపాయలు చెల్లించాల్సిందే. తాను కర్ణాటకలోని బిచ్చల్ గ్రామం నుండి వచ్చాను. తల నీలాలకు రూ.100 ముక్కు పిండి వసూలు చేస్తున్నారు. సామాన్య భక్తులు భారంగా ఉంటుంది. భక్తులకు ఇలాంటి బాధల నుండి విముక్తి చేయాలి.

అధిక ధరలకు టెంకాయల విక్రయం

- నాగేంద్ర, భక్తుడు



శ్రీ నరసింహ ఉరుకుంద ఈరన్న స్వామి పుణ్యక్షేత్రంలో టెంకాయలు అధిక ధరలకు విక్రయిస్తున్నారు. జత టెంకాయలకు 70 రూపాయలు వసూలు చేస్తున్నారు. అధికారులు నిర్ణయించిన ధరలకు విక్రయించేలా చర్యలు తీసుకోవాలి.

ఆదోనిలో ఆధునిక వైద్యం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - ఆదోని


ఆస్పత్రి సేవల విభాగాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే

ఆదోని పట్టణంలోని ఆధునిక వైద్య సేవలు అందుబాటులోకి రావడం శుభ పరిణామమని ఎమ్మెల్యే సాయి ప్రసాద్ రెడ్డి అన్నారు. సోమవారం ఆదోని పట్టణంలోని ఎస్‌కెడి కాలనీలో శ్రీ సాయి నర్సింగ్ హోమ్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. ఆధునిక వైద్యం కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లే పరిస్థితి రాకుండా అన్ని వసతులతో కూడిన ఆసుపత్రి నెలకొల్పి వైద్యం అందుబాటులోకి తీసుకొస్తున్నారని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి అన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ ఇమాన్ మాట్లాడుతూ తమ నర్సింగ్ హోమ్‌లో ఐసీయూ వెంటిలేటర్ సదుపాయం కలదు అన్నారు. 24 గంటలు సేవలందించే విధంగా వైద్య సిబ్బంది ఉన్నారన్నారు. సరసమైన ధరలకే వైద్యం అందిస్తు ఇప్పటికి 30 మంది గర్భవతులకు నొప్పి బాధ లేకుండా కాన్పులు చేశామన్నారు.

డిగ్రీ,ఐటిఐ కళాశాలల భవన నిర్మాణాలకు నిధులు కేటాయించాలి : ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి-ఆలూరు


వినతి పత్రం ఇస్తున్న నాయకులు

ప్రభుత్వ డిగ్రీ,ఐటిఐ కళాశాలకు నిధులు కేటాయించి భవన నిర్మాణాలు చేపట్టాలని సోమవారం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో దశలవారి కార్యక్రమంలో భాగంగా కళాశాల విద్యార్థులతో కలిసి ర్యాలీగా తహసీల్దార్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించి తహశీల్దార్ రామాంజనేయులుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ మండల అధ్యక్షుడు ఎస్.పోతురాజు,సహాయకార్యదర్శి పరమేష్ మాట్లాడుతూ ప్రభుత్వ డిగ్రీ,ఐటిఐ కళాశాలకు స్థలం కేటాయించి భవనాలు నిర్మించాలని ఎన్నో ఏళ్లుగా ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో పోరాటాలు చేసే స్థలం కేటాయించడం తప్ప.. నిర్మించడంలో పాలకులు,అధికారులు విఫలం చెందారన్నారు. వెనుక ప్రాంతమైన ఆలూరు నియోజకవర్గ పేద విద్యార్థులను దృష్టిలో ఉంచుకొని నిధులు మంజూరు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మండల ఉపాధ్యక్షులు గిరిమాధ్రి,ధనుంజయ,మండల నాయకులు రమేష్,మల్లికార్జున, నాగలింగ,నరసప్ప,పులిశేకర్,రాజేశ్వర,మహేశ్వరి,మంజువాణి, ఐశ్వర్య,కస్తూరి తదితరులు పాల్గొన్నారు.

పంట నమోదులో వేలిముద్ర తప్పనిసరి : ఎఒ

ప్రజాశక్తి - చిప్పగిరి



పంట నమోదు చేయించుకున్న రైతులందరూ వేలిముద్రలు తప్పనిసరిగా చేయాలని వ్యవసాయ శాఖ మండల అధికారి జయలక్ష్మి సూచిస్తున్నారు. సోమవారం మండల కేంద్రమైన చిప్పగిరి వ్యవసాయ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ అనేక గ్రామాలలో రైతులు వేలిముద్ర వేయడం లేదని, కేవలం భూ దస్తావేజు జిరాక్స్ కాపీలను, ఆధార్ జిరాక్స్, బ్యాంకు జిరాక్స్ కాపీలను ఇచ్చి వెళుతున్నారన్నారు. వీటితోపాటు రైతు వేలిముద్ర తప్పనిసరిగా ఉండాలని రైతులకు, అగ్రికల్చర్ వారి సిబ్బందికి తెలియజేశారు. ఈ విషయాన్ని ప్రతి ఒక్క రైతు గమనంలో ఉంచుకొని వేసుకున్న పంటలో ఫోటో దిగి వేలిముద్రను వేసుకుంటేనే యాప్ పరిగణలోకి తీసుకుంటుందన్నారు. అప్పుడే ప్రభుత్వం అందించే పరిహారం వర్తిస్తాయన్నారు. ఏఈఓ రమాదేవి, అగ్రికల్చర్ అసిస్టెంట్ రంగస్వామి పాల్గొన్నారు.



ధర్నా నిర్వహిస్తున్న దృశ్యం

ఉపాధ్యాయులకు జీతాలను చెల్లించాలి : ఫ్యాప్టో

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

రెండు నెలలుగా పెండిగ్‌లో ఉన్న బదిలీ, పదోన్నతి పొందిన ఉపాధ్యాయులకు జీతాలు వెంటనే చెల్లించాలని ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య తాలూకా కన్వీనర్ వీజీ వెంకటరాముడు, ఫ్యాప్టో జిల్లా కార్యవర్గ సభ్యులు కరే కృష్ణ, ఎల్లప్ప కో కన్వీనర్స్ బసవరాజు, కాసింజి డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక వీవర్స్ కాలనీ హైస్కూల్ నందు తాలూకా సమావేశము జరిగింది. ఉపాధ్యాయ సమస్యలను పరిష్కరిం చాలని, జీవో 117ను రద్దు చేయాలని, సిపిఎస్‌ను రద్దు చేయాలని కోరుతూ ఈనెల 23వ తేదీన విజయవాడలో పాఠశాల విద్యాశాఖ కార్యాలయం ఎదురుగా ధర్నా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బాబయ్య, మల్లారి నాగరాజు, వీరేష్, సోమేశ్వర రెడ్డి, వేంకటేశ్వర్లు, నరసింహులు, నాగేశ్వర రావు, పాపన్న పాల్గొన్నారు.

సంక్షేమ హాస్టళ్లకు సొంత భవనాలు ఏర్పాటు చేయాలి : టిఎన్ఎస్ఎఫ్

ప్రజాశక్తి - ఆదోని

ప్రభుత్వ సంక్షేమ హాస్టళ్లకు సొంత భవనాలు ఏర్పాటు చేయాలని టీఎన్ఎస్ఎఫ్ జిల్లా అధికార ప్రతినిధి బోయ తేజ డిమాండ్ చేశారు. సోమవారం ఆదోని సబ్ కలెక్టర్ కార్యాలయంలో అధికారికి వినతి పత్రం అందజేశారు. తేజ మాట్లాడుతూ హాస్టళ్లు కొనసాగుతున్న భవనాలు శిథిలా వస్థకు చేరుకోవడంలో విద్యార్థులు బిక్కుబిక్కుమని జీవిస్తున్నారన్నారు. నాణ్యమైన భోజనం పెట్టాలని తదితర సమస్యలు పరిష్కరించాలని, లేనిపక్షంలో పోరాటాలకు సిద్ధమవుతామన్నారు. నియోజక వర్గ అధ్యక్షులు బెస్త జయ సూర్య, ప్రధాన కార్యదర్శి బాల్లేకల్లు సూర్య, ఉపాధ్యక్షులు నూర్, రవి, వెంకీ, నాయకులు అశ్విన్,మెహబూబ్, సాయి పాల్గొన్నారు.

'మీ పిల్లలను హాస్టల్ నుంచి తీసుకెళ్లండి'

- ఎపి మోడల్ స్కూల్ కోసిగి హాస్టల్‌లో బియ్యం కరువు

ప్రజాశక్తి - కోసిగి

'మీ పిల్లలను హాస్టల్ నుంచి తీసుకుని వెళ్ళండి. మా హాస్టళ్లలో బియ్యం లేవు. వారికి అన్నం పెట్టాలేని పరిస్థితి మాది. రోజు పాఠశాల నుంచి మీ ఊరికి అప్ అండ్ డౌన్ చేయించండి' అంటూ విద్యార్థుల తల్లిదండ్రులకు ఫోన్లు చేస్తున్నారు మోడల్ స్కూల్ హాస్టల్ సిబ్బంది. ఇదేంటి మోడల్ స్కూల్‌కు సంబంధించిన హాస్టల్‌కు బియ్యం ఎందుకు రాలేదని విద్యార్థుల తల్లిదండ్రులు ప్రభుత్వంపై అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఏపి మోడల్ స్కూల్ కోసిగి సంబంధించిన బాలికల హాస్టల్‌లోని విద్యార్థులకు ఈ విద్య సంవత్సరంకు ప్రభుత్వం నుంచి ఇప్పటి వరకు బియ్యం రాలేదు. ఈ హాస్టళ్లలో దాదాపు 78 మంది బాలికలు చదువుతున్నారు. మూడు నెలలుగా 78 విద్యార్థులకు ఎలాగైనా అన్నం పెట్టాలన్నా ఉద్దేశంతో 10 క్వింటాళ్ల మేర, వేరే పాఠశాల నుంచి బియ్యం అరువు తెచ్చుకుని మరీ ఆ హాస్టల్‌ను నడిపిస్తునట్లు విశ్వసనీయ సమాచారం. ఇకా రేపు విద్యార్థులకు అన్నం ఎలా పెట్టాలి.. ఎవ్వరి దగ్గర అరువుగా తెచ్చుకోవాలి అనే దుస్థితి ఆ హాస్టల్‌కు ఏర్పడింది. దీంతో చేసేది ఎమి లేక విద్యార్థుల తల్లిదండ్రులకు మీ పిల్లలను హాస్టల్ నుంచి ఇంటికి తీసుకుని వెళ్ళండి. రోజు ఇంటి నుంచి పాఠశాలకు అప్ అండ్ డౌన్ చేయించండి హాస్టల్‌కు బియ్యం వచ్చేవరకు అంటూ ఆ హాస్టల్ సిబ్బంది ఫోన్ చేశారని విద్యార్థులు తల్లిదండ్రులు తెలిపారు. ఈ విషయం పై సంబంధించిన హాస్టల్ సిబ్బందిని వివరణ కోరగా తమ హాస్టల్‌కు మూడు నెలలుగా బియ్యం రాలేదని, ఇప్పటికే వేరే పాఠశాల నుంచి అప్పుగా బియ్యం తెచ్చుకుని హాస్టల్ నడిపిస్తున్నామని తెలిపారు. హాస్టల్ బియ్యం లేకనే విద్యార్థులకు అలా చెప్పాము. బియ్యం ఉంటే ఎందుకు అలా చెబు తామని వారు అన్నారు.



మూల రామ వసతి నిలయ నిర్మాణం అభినందనీయం

- పీఠాధిపతులు సుభుదేంద్రతీర్థులు

ప్రజాశక్తి -మంత్రాలయం

ప్రముఖ ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రమైన మంత్రాలయంలో ఒకే వ్యక్తి ద్వారా వంద గదుల సముదాయ నిర్మాణం అభినందనీయం అని శ్రీమఠం పీఠాధిపతులు సుభుదేంద్రతీర్థులు అన్నారు. బెంగళూరుకు చెందిన సోమశేఖర్ అనే ఒకే భక్తుడు నిర్మించిన శ్రీ మూలరామ నిలయం అనే 102 గదుల సముదాయాన్ని సోమవారం ఆయన పండితుల వేద మంత్రాలతో మంగళ వాయిద్యాల నడుమ ప్రారంభించారు. అంతకుముందు దాత పీఠాధిపతికి ఘనంగా స్వాగతం పలికి పుష్పాభిషేకంతో శాలువతో పూల మాలలు వేసి సత్కరించారు. ఈ సందర్భంగా పీఠాధిపతులు సుభుదేంద్రతీర్థులు మాట్లాడుతూ వసతి గృహ సముదాయం నిర్మాణానికి ఎంత ఖర్చు అయిందనేది భక్తుడు సోమశేఖర్‌కు మాత్రమే తెలుసని, ఆయన గురు భక్తికి నిదర్శనం అన్నారు. అన్ని సౌకర్యాలతో సుందరంగా నిర్మించిన ఈ సముదాయం భక్తులకు ఉపయోగకరం అవుతుందని తెలిపారు. ప్రస్తుతం శ్రీ మఠం నిర్వహణలో ఉన్న అద్దె గదులు దాతల సహకారంతో నిర్మించడం వల్ల ఏడాదిలో రద్దీగా ఉండే


జ్ఞాపికలను అందజేస్తున్న పీఠాధిపతులు

సమయంలో నిభందన ప్రకారం వారికి కేటాయించేందుకు తీసి పెట్టవలసి వస్తుందని తద్వారా సామాన్య భక్తులకు అద్దె గదులు దొరక్క ఇబ్బందులు పడే పరిస్థితి ఉండేదన్నారు. ఈ నెల 29 వ తేదీ నుండి సెప్టెంబరు 4వ తేదీ వరకు శ్రీ గురు రాఘవేంద్రస్వామి సప్త రాత్రోత్సవాలు జరుగుతున్న నేపథ్యంలో ఈ వసతి గృహం భక్తులకు అందుబాటులోకి వస్తుందని తెలిపారు. ఈ సందర్భంగా దాత సోమశేఖర్‌ను ఆయన కుటుంబ సభ్యులను పీఠాధిపతులు శ్రీ సుభుదేంద్రతీర్థులు శేష వస్త్రం ఫల మంత్రాక్షతలు మెమొంటో అందజేసి ఆశీర్వదించారు.

కృషి చేసిన సిబ్బందికి అభినందనలు

శ్రీ మూల రామ నిలయం వసతి గృహం నిర్మాణంలో ప్రముఖ పాత్ర వహించిన శ్రీ మఠం సిబ్బందిని, భక్తులను పీఠాధిపతులు సుభుదేంద్ర తీర్థులు అభినందించారు. దాత అయిన సోమశేఖర్‌ను పరిచయం చేసిన శ్రీ మఠం అసిస్టెంట్ మేనేజర్ ఐపి నరసింహమూర్తి బెంగళూరుకు చెందిన మోహన్ సోమశేఖర్ స్నేహితులు శ్రీ మఠం మేనేజర్ యస్కే, శ్రీనివాసరావు, వెంకటేష్ జోషి, ఇఇ సురేష్, కోనాపూర్, పిఆర్వో గుంజళ్లి విజయీంద్రా చార్, ఇతర సౌకర్యాల కల్పనకు కృషి చేసిన వారికి శేష వస్త్రం ఫల మంత్రాక్షతలు అందజేసి ఆశీర్వదించారు.




స్వామివారిని దర్శించుకున్న ఎమ్మెల్యే వై బాలనాగిరెడ్డి

ఈరన్న స్వామి సన్నిధిలో ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి

ప్రజాశక్తి - కౌతాళం

శ్రీ నరసింహ ఉరుకుంద ఈరన్న స్వామిని మంత్రాల యం ఎమ్మెల్యే వై బాలనాగిరెడ్డి దర్శించుకున్నారు. శ్రావణమాసం తొలి సోమవారం పుణ్యక్షేత్రానికి రావడంతో దేవాలయ అధికారులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం ఎమ్మెల్యేను పూలమాలలతో శాలువ తో సత్కరించారు. ఈ కార్యక్రమంలో దేవాలయ సహా కమిషనర్ వాణి, ప్రధాన అర్చకులు ఈరప్ప స్వామి, సూపర్డెంట్లు వెంకటేష్ రామ్మోహన్ దేవాలయ సిబ్బంది అర్చక సిబ్బంది పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి - మంత్రాలయం

మృతుడు దుల్లయ్య కుటుంబానికి గ్రామ సర్పంచ్ తెల్లబండ్ల భీమయ్య ఆర్థిక సహాయం అందజేశారు. ఇటీవల స్థానిక సచివాలయం-1 పరిధిలో నివాసముంటున్న దుల్లయ్య ఈ నెల 18వ తేదిన మరణించాడు. మతునికి వైఎస్సార్ బీమా నమోదు కావడంతో తక్షణ సహాయం కింద ఎమ్మెల్యే వై. బాలనాగిరెడ్డి రాంపురం రెడ్డి సోదరుల ఆదేశాల మేరకు సర్పంచ్ తెల్లబండ్ల భీమయ్య సోమవారం నామిని లక్ష్మికి రూ. 10 వేల నగదును అందజేశారు. బీమా పథకంలో మిగిలిన నగదును నామినీ ఖాతాలో జమ చేస్తామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో వెల్ఫేర్ అధికారి ప్రకాష్, వాలంటీర్ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

వర్షం కురవాలని నేమకల్లులో ప్రత్యేక పూజలు

ప్రజాశక్తి - చిప్పగిరి

వర్షం కురవాలని మండలంలోని నేమకల్లు గ్రామంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. సర్పంచి ప్రేమ్ కుమార్ గ్రామంలో ప్రధాన బావి అయిన నల్లంబావిలో నుంచి 101 కడవలను తాడుతో సేదుకొని వచ్చి శివాలయం ఎదురుగా ఉన్న గడ స్తంభమునకు, శివలింగానికి ప్రథమ పూజలు నిర్వహించారు. గ్రామ పెద్దలు, రైతులు శివాలయంలో 24 గంటలు భజన నిర్వహించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామ పెద్దలు, రైతులు భజన కమిటీ సభ్యులు పాల్గొన్నారు.


కడవలు మోస్తున్న సర్పంచ్ ప్రేమ్ కుమార్

దళితులపై దాడులను అరికట్టాలి : కెవిపిఎస్


మాట్లాడుతున్న కెవిపిఎస్ జిల్లా సహాయ కార్యదర్శి రమేష్ బాబు

ప్రజాశక్తి - ఆస్పరి

రాష్ట్రంలో దళితులపై జరుగుతున్న దాడులు,కుల వివక్షతలను అరికట్టాలని కెవిపిఎస్ జిల్లా సహాయ కార్యదర్శి గిత్తరి రమేష్ బాబు డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక సుందరయ్య భవనంలో దళితుల విస్తత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుండి రాష్ట్రంలో దళితులపై దాడులు,అంటరానితనం,కుల వివక్షతకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దాడులకు పాల్పడిన వారిపైన ఎస్సీ,ఎస్టీ, అట్రాసిటీ కేసులు పెట్టిన పోలీసులు 41సీఆర్పీ ఎస్ ప్రకారం స్టేషన్ బెయిల్ ఇచ్చి,నిందితులను కాపాడే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. దళితుల సంక్షేమ పథకాలకు నిధులు కేటాయించి ఆదుకోవాలన్నారు. జస్టిస్ పున్నయ్య కమిషన్ సిఫారసులను వెంటనే అమలు చేయాలన్నారు. అర్హులై 40 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరికి డప్పు కళాకారులకు, చర్మకార వృత్తి దారులకు పెన్షన్ ఇవ్వాలని, ప్రస్తుతం ఇస్తున్న రూ.3 వేల పెన్షన్‌ను రూ.5 వేలకు పెంచాలన్నారు. కొత్త పెన్షన్ విషయంలో డిజిటల్ సర్టిఫికెట్,గుర్తింపు కార్డులు అని ఇబ్బంది పెట్టకుండా సెల్ఫ్ డిక్లరేషన్ ద్వారానే పెన్షన్ ఇవ్వాలని పేర్కొన్నారు. డప్పు కళాకారులకు వెంటనే డప్పు, గజ్జలు,డ్రస్సులు,చర్మకార వత్తి దారులకు రూ.20 వేల విలువ చేసే వృత్తి పరికరాలు ఇవ్వాలని, అర్హులైన ప్రతి దళిత కుటుంబానికి 3 సెంట్లు ఇంటి స్థలం కేటాయించి,పక్కా గహ నిర్మాణానికి రూ.5 లక్షలు కేటాయించాని,2 ఎకరాల వ్యవసాయ సాగు భూమి ఇవ్వాలని కోరారు. లేని పక్షంలో రాబో యే ఎన్నికల్లో తగిన బుద్ధి చెబుతామన్ని హెచ్చిస్తున్నారు. ఈ కార్యక్రమంలో డప్పు కళాకారులు మునిస్వామి, సంజప్ప,అంజినయ్య, నరసింహులు, రంగస్వామి,బంగారప్ప, నాగన్న,శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.

మళ్లీ కుంగిన ఎస్ఎస్ ట్యాంక్ బండ్

- పరిశీలించిన ఎమ్మెల్యే , మున్సిపల్ అధికారులు

ప్రజాశక్తి - ఆదోని

ఆదోని పట్టణంలోని మూడు లక్షల మందికి పైగా ఉన్న జనాభాకు గాను తాగునీరు అందించే బసాపురం ఎస్ఎస్ ట్యాంక్ బండ్ కుంగిపో యింది. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే సాయి ప్రసాద్ రెడ్డి సోమవారం మున్సిపల్ చైర్ పర్సన్ బోయ శాంత, మున్సిపల్ కమిషనర్ రఘునాథ్ రెడ్డి, మున్సిపల్ ఎంఈ నాగభూషణం రెడ్డిలతో కలిసి ఎస్ఎస్ ట్యాంక్‌ను సందర్శించి కుంగి పోయిన ప్రాంతాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సాయి ప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ ఇప్పటికే మరమ్మతులు చేసిన అది పనిచేయడం లేదని బండు నిలబడడం లేదని, 100 మీటర్లు బండ్ సమస్య ఉందనుకుంటే అది 500 మీటర్లకు చేరుకుందని ఆందోళన వ్యక్తం చేశారు. సమస్యను వెంటనే ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తున్నట్లు ఎమ్మెల్యే స్పష్టం చేశారు. ఇప్పటికే రూ.10 కోట్ల రూపాయల మంజూరు కోసం ప్రతిపాదనలు పంపామని, ప్రస్తుతం సమస్య తీవ్రంగా ఉందని రూ. 35 కోట్లు ప్రభుత్వం మంజూరు చేస్తే పూర్తి సమస్య పరిష్కారం అవుతుందని ఆయన వివరించారు. ఎస్ఎస్ ట్యాంకు నిర్మాణ సమయంలో రివిట్మెంట్ ఏర్పాటు చేయాల్సిన అప్పటి అధికారులు సిమెంట్ లైనింగ్ చేయడం వల్ల లైనింగ్ సందుల్లో నీరు వెళ్లి బండ్ కుంగిపోయిందని సిమెంట్ లైనింగ్ పడిపోయిందని మున్సిపల్ ఎం ఇ నాగభూషణం రెడ్డి తెలిపారు. పెద్ద ఎత్తున బండ్ కుంగిపోయిందని వెంటనే మరమ్మతు చేయకపోతే మరింత సమస్య ఎక్కువ అవుతుందని, దీనిపై ఇప్పటికే ప్రతిపాదన పంపామని ఆయన తెలిపారు. చైర్ పర్సన్ శాంతా వైస్ చైర్మన్లు నరసింహులు, మహమ్మద్ గౌస్, కౌన్సిలర్లు చలపతి, చిన్న సురేష్, నాయకుడు చంద్ర కాంత్ రెడ్డి, నారాయణ ఉన్నారు.


ట్యాంకును పరిశీలించిన ఎమ్మెల్యే

నెరవేరని సిఎం హామీ

- రోడ్లు ఇరుక్కు అవుతున్న పట్టించుకోని అధికారులు
- రాకపోకలకు ఇబ్బందులు పడుతున్న వాహనదారులు

ప్రజాశక్తి - ఆదోని

రోడ్డు వెడల్పు చేయించి ఆదోని పట్టణ అభివృద్ధికి అహర్నిశలు పాటు పడతామని పాలకులు చెబుతూనే ఉన్నారు. ప్రభుత్వాలు మారిన ఎమ్మెల్యేగా ఎవరు ఎన్నికైన ఆదోని పట్టణ అభివృద్ధిని మాత్రం పట్టించుకో డం లేదన్న పరిస్థితులు ఉన్నాయని పురవాసులు బహిరంగంగా చర్చించు కుంటున్నారు. మిల్లులు,నూనె,పత్తి పరిశ్రమలు ఉండడంవల్ల వందలాది మంది కార్మికులకు ఉపాధి కల్పిస్తూ వ్యాపార కేంద్రంగా వెలిగింది. మారిన సంస్కరణల వల్ల ప్రస్తుతం పరిశ్రమలు మూతపడడంతో ఉపాధి కరువైంది. యువత, కూలీలు ముంబై, చెన్నై, బెంగళూరు, హైదరాబాద్ సుదూర ప్రాంతాలకు వలస వెళుతున్న పరిస్థితి. ఇక్కడ కొత్తగా పరిశ్రమ లు పెట్టేందుకు పరిస్థితులు అనుకూలంగా ఉన్నాయని నీటి వసతి కల్పిస్తే ఆదోని ఏరియా మరింత అభివృద్ధి చెందెందుకు అవకాశం ఉందని పలువు రు చెబుతున్న ఆ దిశగా పాలకులు కృషి చేయడం లేదన్నది తెలుస్తోంది.

ఇరుకైన రోడ్లు : ఆదోని పట్టణంలో మున్సిపల్ మెయిన్ రోడ్డు గుండానే బళ్ళారి, సిరుగుప్ప, రాయచూర్, మంత్రాలయం ప్రాంతాలకు వాహనాలు వెళ్లాల్సి ఉంది. ఆ రోడ్డు గుండానే వ్యవసాయ మార్కెట్ యార్డ్ కు సరుకులు ప్రతి రోజు తరులుతున్నాయి. ఉదయం పూట పాత బస్టాండ్ కూడలిలో వాహనాలు నిలిచి ఆ ప్రాంతమంతా రద్దీగా మారు తుంది. ప్రత్యామ్నాయ రోడ్డు లేకపోవడం వల్ల వాహనాలు నిలిచి ఉండటంతో జనం ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి ఉంది. ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల నుండి పోలీస్ కంట్రోల్ రూమ్ వరకు 80 అడుగులు, ఎమ్మిగనూరు టర్నింగ్ నుండి ప్రభుత్వ ఏరియా హాస్పిటల్ వరకు 100 అడుగులు, ఎమ్మిగనూరు టర్నింగ్ నుండి కొత్త బస్టాండ్ బైపాస్ రోడ్డు వరకు 80 అడుగులు రోడ్డు వెడల్పు ఉన్నట్లు రికార్డులు చెబుతున్నాయి. ప్రస్తుతం రోడ్డుకు ఇరువైపులా అన్యాక్రాంతం కారణంగా రోడ్లు ఇరుగ్గా మారాల్సిన పరిస్థితి వచ్చింది.


వాహనాలతో రద్దీగా ఉన్న మెయిన్ రోడ్డు

పెరిగిన వాహనాలు: పట్టణంలో సుమారు రెండున్నర లక్షలు పైగానే జనాభా ఉంది. రోజు చుట్టుపక్కల ప్రాంతాల వారు ఇతర వ్యాపార ఇతర పనుల నిమిత్తం వచ్చే వారి సంఖ్య అధికంగానే ఉంటుంది. ఈ కారణంగా వాహనాలు వాడే సంఖ్య కూడా రోజురోజుకు పెరుగుతోంది. కనీసం బైకులు నిలుపుకునేందుకు కూడా స్థలం లేకపోవడంతో రోడ్ సైడ్ నిలిపి పోలీ స్ కేసులు పెట్టించుకుంటూ జరిమానాలు చెల్లించాల్సి వస్తుందని పలువురు వాపోతున్నారు.

అమలు కానీ సీఎం హామీ : ఆదోని పట్టణంలో రోడ్డు వెడల్పుకు 60 కోట్లు కేటాయిస్తున్నామని గత ఎడాది జూలై మాసంలో 5వ తేదీన ఆదోని పర్యటనలో సీఎం జగన్మోహన్ రెడ్డి హామీ ఇచ్చారు. హామీ ఇచ్చి ఏడాది గడిచిన అమలకు నోచుకోకపోవడంతో అధికారుల అలసత్వం తేట తెలమవుతోంది. మున్సిపల్ మెయిన్ రోడ్ నుండి పిఎన్ రోడ్డు, మహాత్మా గాంధీ రోడ్డు ఒకటిన్నర కిలోమీటర్ చొప్పున వెడల్పు చేసేందుకు అధికారులు కొలతలు వేశారు. అమౌంటు చాలకపోవడంతో ప్రతిపాదనలు రికార్డులకు పరిమితమైంది. రోడ్డు వెడల్పు 60 అడుగులు చేయాలని అందులో ఉందని అధికారులు చెబుతున్నారు. రూ.160 కోట్లు అవసరం ఉందని మున్సిపల్ అధికారులు చెబుతున్నారు.

రోడ్లు వెడల్పుకు ప్రతిపాదనలు

- రఘునాథరెడ్డి మున్సిపల్ కమిషనర్ ఆదోని.




ఆదోని పట్టణంలోని పిఎన్ రోడ్డు, మున్సిపల్ మెయిన్ రోడ్డు వెడల్పుకు ప్రతిపాదనలు సిద్ధం చేశాము. ఇప్పటికే మెజర్మెంట్ పూర్తి చేసి రికార్డులు ప్రభుత్వానికి పంపాము గణేష్ సర్కిల్ నుండి మున్సిపల్ రోడ్డు వరకు సుమారు రెండున్నర కిలోమీటర్లు రోడ్డు వెడల్పుకు ప్రభుత్వం నుండి అనుమతి వచ్చింది. త్వరలోనే నిధులు రాగానే నష్టపరిహారం అందించి రోడ్లు వెడల్పుకు చర్యలు తీసుకుంటాం.

రోడ్లు వెడల్పు చేసి అభివృద్ధి పరచాలి

- లక్ష్మన్న సిపిఎం పట్టణ కార్యదర్శి



రోడ్లు ఇరుగ్గా ఉండటం వల్ల నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి. ఆదోనికి ప్రక్రియ రోడ్డు లేకపోవడం వల్ల పట్టణం గుండానే భారీ వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి. అన్యాక్రాంతమైన లింక్ రోడ్లు వెడల్పు చేసి పట్టణ అభివృద్ధికి అధికారులు చర్యలు తీసుకోవాలి. ఎన్నికల సందర్భంగా రోడ్లు వెడల్పు చేస్తామని మాస్టర్ ప్లాన్ అమలు చేస్తామని ఇచ్చిన హామీని ఎమ్మెల్యే సాయి ప్రసాద్ రెడ్డి నిలబెట్టుకోవాలి. అధికారుల నిర్లక్ష్యం చేస్తే పురవాసులతో ఆందోళన నిర్వహిస్తాం.





స్పందనలో వినతులు స్వీకరిస్తున్న జిల్లా కలెక్టర్, జెసి

స్పందన వినతుతలకు సత్వర పరిష్కారం

- జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ సామూన్

ప్రజాశక్తి నంద్యాల కలెక్టరేట్

ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యతనిస్తున్న జగనన్నకు చెబుదాం - స్పందన కార్యక్రమంలో స్వీకరించిన విజ్ఞప్తులపై సత్వర చర్యలు తీసుకుని పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ సామూన్ జిల్లా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్లోని వైఎస్సార్ సెంటినరీ హాలులో ప్రజా సమస్యల పరిష్కార వేదిక స్పందన కార్యక్రమం నిర్వహించారు. జిల్లా కలెక్టర్తో పాటు జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి, ఇతర జిల్లాధికారులు పాల్గొని జిల్లా నలుమూలల నుండి వచ్చిన అర్జీదారుల నుండి దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఫిర్యాదులను నిర్ణీత కాల పరిమితిలోగా ప్రజలు సంతృప్తి చెందే స్థాయిలో పరిష్కరించాలని ఆదేశించారు. పెండింగులో వున్న 132 రీఓపెన్ సర్వీసులకు సంబంధించి దరఖాస్తులన్నింటినీ వెంటనే క్లియర్ చేయాలన్నారు. ఏ ఒక్క దరఖాస్తు బియాండ్ ఎస్ఎల్ఏలోకి వెళ్లకుండా నాణ్యతతో పరిష్కరించాలన్నారు. మొక్కుబడి రీతిలో క్లోజ్ చేయకుండా అర్జీదారులు సంతప్తి చెందే స్థాయిలో ఖచ్చితమైన పరిష్కారం చూపాలన్నారు. పెండింగ్ లో ఉన్న జగనన్నకు చెబుదాం ఈకేవైసీని రెండు, మూడు రోజుల్లో పూర్తి చేయాలని ఆదేశించారు. గడపగడపకు మన ప్రభుత్వం ద్వారా మంజూరైన 1372 పనుల్లో 705 పురోగతిలో వున్నాయని, మిగిలిన పనులు వెంటనే గ్రౌండ్లోకి తీసుకరావాలని సంబంధిత అధికారులకు సూచించారు. గ్రాస్ ఎన్రోల్మెంట్ సర్వే త్వరితగతిన పూర్తి చేసి బడి బయట ఉన్న విద్యార్థులను పాఠశాలల్లో చేర్పించాలన్నారు.

స్పందనలో కొన్ని వినతులు..

– 'నాకు మాజీ సైనికుల కోటా కింద 2012లో సర్వే 174, 175లలో 9.8 సెంట్లు ఇచ్చారు. ఆ భూమిని సాగు చేసుకుంటున్నాను. జిఒ 297 ప్రకారం అసైన్మెంట్ నిషేధిత జాబితా నుండి తొలగించాలి' అనిబనగానపల్లె మండల నివాసి మాజీ సైనికుడు ఎస్ ఎం బాషా కలెక్టర్కు దరఖాస్తు సమర్పించారు.

– దొర్నిపాడు మండలం క్రిష్టిపాడు గ్రామ నివాసి బికారి సాహెబ్ తనకున్న 1.95 సెంట్ల స్థలాన్ని ఆన్లైన్లో ఎక్కించాలని కోరుతూ వినతి అందజేశాడు.

– మహానంది మండలం గాజులపల్లి గ్రామ నివాసితురాలు జయమ్మ తనకు సర్వే నంబర్ 34లో 16 సెంట్ల భూమి వుందని, ఆ స్థలంలో కరెంట్ తీగలు వెళ్లాయని, తొలగించేందుకు ఏపీఎస్పీడీసీఎల్ అధికారులు అధిక మొత్తంలో ఛార్జ్ చేస్తున్నారని, అధిక మొత్తం చెల్లించుకోలేనని, కరెంటు తీగల తొలగింపుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ను కోరారు. ఇంకా ఈ కార్యక్రమంలో 215 మంది అర్జీదారులు తమ సమస్యలపై వినతి పత్రాలు అందజేశారు. ఈ సమస్యలను వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులకు ఎండార్స్ చేస్తూ వారు ఆదేశాలు జారీ చేశారు.

కరువుగా ప్రకటించాలి

- అధికారులతో నష్ట పరిహారం అంచనా వేయించాలి
- రబీకి ఉచితంగా విత్తనాలు, మందులు ఇవ్వాలి
- అధిక ధరలు, నిరుద్యోగం, విద్యుత్ చార్జీలపై సెప్టెంబర్లో పోరాటం
- సిపిఎం జిల్లా కార్యదర్శి టి.రమేష్ కుమార్



మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి టి.రమేష్ కుమార్

ప్రజాశక్తి - పాములపాడు

గత నెల రోజులుగా వర్షాలు కురవక మొక్కజొన్న, పత్తి లాంటి పైరలు ఎండి పోయాయని, రైతులు కొన్ని పంటలను దున్నేసారని, తక్షణమే ప్రభుత్వం కరువు ప్రకటించి అధికారులతో నష్టపరిహారాన్ని అంచనా వేయించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి టి.రమేష్ కుమార్ డిమాండ్ చేశారు. సోమవారం పాములపాడులో జరిగిన సిపిఎం మండల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఖరీఫ్ సీజన్లో వర్షాలు అధికంగా కురిసినప్పటికీ ఆ తర్వాత నెల రోజుల వరకు వర్షం లేకపోవడంతో జిల్లాలో వర్షాధార పంటలన్నీ ఎండిపోవడంతో రైతులు దున్నేశారని తెలిపారు. ప్రభుత్వం కరువు ప్రకటించి నష్టాన్ని అంచనా వేయాలన్నారు. రబీ సీజన్కు రైతులకు విత్తనాలు, ఎరువులు ఉచితంగా పంపిణీ చేయాలన్నారు. సెప్టెంబర్ నెలలో సిపిఎం ఆధ్వర్యంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వ్యతిరేక విధానాలకు ఆందోళన కార్యక్రమం చేపడుతున్నట్లు తెలిపారు. కేంద్రంలో బిజెపి ప్రభుత్వం వచ్చాక దేశంలో నిత్యవసర వస్తువు ధరలు, పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు అధికంగా పెరిగాయని చెప్పారు. లక్షల సంఖ్యలో దేశంలో నిరుద్యోగం పెరిగిపోయిందని అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణమే ఖాళీగా ఉన్న పోస్టులన్నీ భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. విద్యుత్ ఛార్జీలు అధికంగా పెంచి ప్రజలపై పెనుభారాలు మోపారన్నారు. సామాన్యులు విద్యుత్ ఛార్జింగ్ కట్టలేని పరిస్థితి ఉందన్నారు. రైతుల వ్యవసాయ బోర్లకు మీటర్లు బిగించడాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. విద్యుత్ చార్జీలను వెంటనే తగ్గించాలని తదితర సమస్యలపై సెప్టెంబర్ 1 నుండి నిర్వహించే ఆందోళన కార్యక్రమాలలో ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు యేసురత్నం, రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.రాజశేఖర్, జిల్లా నాయకులు రామేశ్వరావు, సిపిఎం మండల కార్యదర్శి సామన్న, నాయకులు వెంకటేశ్వరరావు, బాలయ్య, హనుమంతు, బాల యేసు, రవణమ్మ తదితరులు పాల్గొన్నారు.

శ్రీశైల క్షేత్రంలో భక్తుల రద్దీ



క్యూలైన్లలో వేచి ఉన్న భక్తులు

ప్రజాశక్తి - శ్రీశైలం

శ్రావణ మాసం పురస్కరించుకొని సోమవారం శ్రీశైల క్షేత్రంలో భక్తుల రద్దీ పెరిగింది. స్వామి అమ్మవారిని దర్శించుకునేందుకు తెలుగు రాష్ట్రాల నుండే కాక కర్ణాటక, తమిళనాడు, మహారాష్ట్ర ప్రాంతాల నుండి భక్తులు అధిక సంఖ్యలో ప్రత్యేక వాహనాల్లో శ్రీశైలం చేరుకుంటున్నారు. భక్తుల రద్దీని దృష్టిలో పెట్టుకొని తెల్లవారు జామున 4-30 గంటలకు ఆలయ ద్వారాలు తెరచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామి అమ్మవార్లను దర్శించుకునేందుకు ఉచిత, శీఘ్ర, అతి శీఘ్ర క్యూలైన్లలో భక్తులకు అనుమతి ఇస్తున్నారు. క్యూ కాంప్లెక్స్లోకి వచ్చిన భక్తులకు మంచినీరు, అల్పాహారం, బిస్కెట్లు అందిస్తున్నారు. స్వామి అమ్మవార్లను దర్శించుకునేందుకు సుమారు రెండు గంటల సమయం పడుతుందని భక్తులు చెబుతున్నారు. భక్తులు అడిగినన్ని లడ్డు ప్రసాదాలు ఇచ్చేందుకు అందుబాటులో ఉంచామని దేవస్థానం అధికారులు తెలిపారు. అలాగే అన్నపూర్ణ భవనంలో భక్తులకు ఉచిత అన్న ప్రసాదాన్ని ఉచితంగా ఏర్పాటు చేశారు. క్షేత్ర పరిధిలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ప్రత్యేక పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసి నిగా కెమెరాలతో కంట్రోల్ రూమ్లో ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నట్లు దేవస్థానం అధికారులు తెలిపారు. క్షేత్ర పరిధిలో ఉన్న కమ్యూనిటీ సత్రాలు, దేవస్థానం గదులు, కాటేజీలు భక్తులతో నిండిపోయాయి.

అన్నదాన పథకానికి విరాళాలు

శ్రీశైల దేవస్థానంలోని నిత్య అన్నదాన పథకానికి పలువురు భక్తులు విరాళాలు అందజేశారు. కర్నూలుకు చెందిన బి హరి కుమార్ రెడ్డి రూ.1,00,116, శ్రీశైలంకు చెందిన డి వెంకట సుబ్రహ్మణ్యం శాస్త్రి రూ.1,01,116 అందజేశారు. వీరు విడివిడిగా స్వామి అమ్మవారిని దర్శించుకుని విరాళాన్ని కుటుంబ సమేతంగా అందజేశారు. దాతలకు శేష వస్త్రాలను, ప్రసాదాలను అందజేసినట్లు దేవస్థానం అధికారులు తెలిపారు.

మల్లన్న సన్నిధిలో శ్రీశైల జగద్గురు పీఠాధిపతి

శ్రీశైల క్షేత్రంలోని భ్రమరాంబ మల్లికార్జున స్వామివార్లను శ్రీశైల జగద్గురు పీఠాధిపతి చెన్న సిద్ధ రామ శివాచార్య దర్శించుకున్నారు. వీరికి ఆలయ రాజగోపురం వద్ద ఆలయ మర్యాదలతో దేవస్థానం కార్యనిర్వహణాధికారి లవన్న, ఉభయ దేవాలయాల ప్రధాన అర్చకులు వేద పండితులు సంప్రదాయపద్ధంగా స్వాగతం పలికారు. ఆ తర్వాత ముందుగా స్వామివారిని అనంతరం అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని వేద ఆశీర్వచనం, మండపంలో వేద పండితులు వేద గోష్ఠి నిర్వహించారు. తర్వాత ఈవో ప్రసాదాలను, జ్ఞాపికను, శేష వస్త్రాలను అందజేశారు.



పనులపై ఆరా తీసి అడిగి తెలుసుకుంటున్న మంత్రి బుగ్గన

షాదీఖానా పనులు నాణ్యతగా చేపట్టాలి

- రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి

ప్రజాశక్తి - బేతంచర్ల

బేతంచెర్ల పట్టణంలో శ్రీనగర్ కాలనీలో నిర్మిస్తున్న షాదీ ఖానా పనులను నాణ్యతగా చేపట్టాలని రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి ఆదేశించారు. సోమవారం షాదీఖానా పనులను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా షాదీఖానాలో శుభకార్యాల నిమిత్తం రూ.20 లక్షలతో నిర్మిస్తున్న వంటశాల, డైనింగ్ హాల్ పనుల పురోగతిని మంత్రి పరిశీలించారు. ముస్లిం నాయకులు, కాంట్రాక్టర్తో షాదీఖానా పనులపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. భవిష్యత్తులో ఎవరికి ఎటువంటి ఇబ్బందులు కలగకుండా పటిష్టంగా నిర్వహించాలని మంత్రి సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బేతంచెర్ల నగర పంచాయతీ చైర్మన్ చలం రెడ్డి, ముస్లిం మైనార్టీ డైరెక్టర్ వైస్ కాజా, ముర్తుజావలి, బేతంచర్ల నగర పంచాయతీ కమిషనర్ రమేష్ బాబు, గౌండా ఖాదర్ భాష, సచివాలయం తిరుమలేశ్వర్ రెడ్డి, సాదిక్ హుస్సేన్ , దస్తగిరి, సంధాని భాష, డి కమల్ తదితరులు పాల్గొన్నారు.

24న చలో విజయవాడ

- జయప్రదం చేయాలని కోరుతూ సిఐటియు ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ

ప్రజాశక్తి- నందికొట్కూరు టౌన్

మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని ఈ నెల 24వ తేదీ జరిగే చలో విజయవాడ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు భాస్కర్ రెడ్డి, పట్టణ కార్యదర్శి గోపాలకృష్ణలు కోరారు. చలో విజయవాడ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరుతూ సోమవారం నందికొట్కూరు పట్టణంలో మున్సిపల్ కార్యాలయం నుండి కొత్త బస్టాండ్ మీదుగా కాలేజీ రోడ్, పటేల్ సెంటర్ వరకు సిఐటియు ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. నాయకులు పరమేష్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి 2019 ఎన్నికల ముందు ప్రతిపక్ష నేతగా అసెంబ్లీలో, బయట పాదయాత్రలో మున్సిపల్ కార్మికులకు, ఉద్యోగులకు అనేక హామీలు ఇచ్చి నేడు అమలు చేయడం లేదన్నారు. మున్సిపల్ కార్మికులను పర్మినెంట్ చేయాలని కోరారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వా లన్నారు. ఇంజనీర్ కార్మికులకు అన్ని సంక్షేమ పథకాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. డైలీ వేజ్ కార్మికులను రెగ్యులర్గా గుర్తించా లన్నారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం రూ.26 వేలు వేతనం ఇవ్వాలని తదితర సమస్యలు పరిష్కరించా లని ఈ నెల 24న చేపట్టే చలో విజయవాడ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ కార్మికులు భాస్కర్, సర్వర్ ఖాన్, మారెన్న, మస్తాన్, రాజేష్, బక్కన్న, శ్రీరాములు, అబ్దుల్ బాసిత్, ప్రభాకర్, చెన్నయ్య, శ్రీనివాసులు, రాము, శేషఫణి శర్మ, చార్లెస్, కమల్ తదితరులు పాల్గొన్నారు.



బైక్ ర్యాలీని ప్రారంభిస్తున్న సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు భాస్కర్ రెడ్డి



విద్యార్థినులతో మాట్లాడుతున్న ఐటిడిఎ పిఒ

విద్యా ప్రమాణాలు మెరుగుపరచాలి : పిఒ

ప్రజాశక్తి - శ్రీశైలం ప్రాజెక్టు

విద్యార్థుల విద్యా ప్రమాణాలు మెరుగు పరచాలని, ఆరోగ్యం, పరిశుభ్రతపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఐటిడిఎ పిఒ రవీంద్రా రెడ్డి హెచ్ఎంలకు సూచించారు.సోమవారం శ్రీశైలం ఐటీడీఏ పరిధిలోని పాణ్యంలోని గురుకులం, మినీ గురుకులం (బాలికలు) పాఠశాలను ఆయన అకస్మికంగా సందర్శించారు. వసతి గృహంలో మరుగుదొడ్ల నిర్వహణలో లోపాలను గుర్తించి కొంత అసంతృప్తిని వ్యక్త పరుస్తూ ప్రధానోపాధ్యాయులను మందలించారు. వంటశాలను పరిశీలించి మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం అందుతుందా లేదా అని ఆరా తీశారు. విద్యార్థుల హాజరు శాతం పెంచాలని, డార్మెటరీలలో దోమలు రాకుండా కిటికీలకు మెస్సులను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అదనపు తరగతి గదులు, ప్రహరీ గోడకు ప్రతిపాదనలు పంపుతామని తెలిపారు. అనంతరం మినీ గురుకులం విద్యార్థినీలతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు.

నేటి నుండి ఆధార్ నమోదు ప్రత్యేక డ్రైవ్

ప్రజాశకి - బండి ఆత్మకూర్

మండలంలోని ప్రజలకు ఈ నెల 22 నుండి 25వ తేదీ వరకు ఆధార్ అప్డేట్ ప్రత్యేక నమోదు కార్యక్రమం చేపడుతున్నట్లు ఎంపీడీవో వాసుదేవ గుప్తా తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ ప్రజలు ఆధార్ కార్డుకు ఫోన్ నెంబర్ లింక్, అడ్రస్ మార్పు, ఆధార్ ఎడిషన్ లాంటివి చేసుకోవాలన్నారు. ఈ ప్రత్యేక క్యాంపును పెద్దదేవలాపురం, భోధనం, చిన్నదేవలాపురం, నారాయణపురం, ఎర్రగుంట్ల, పార్నపల్లి, ఈ కోడూరు, బి కోడూరు, బండి ఆత్మకూరు గ్రామాల్లో నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ అవకాశాన్ని ఆయా గ్రామాల ప్రజల సద్వినియోగం చేసుకోవాలన్నారు. **చాగలమర్రి :** మండలం లోని ఆయా గ్రామాల్లో ఈ నెల 22 నుంచి 25 వరకు ప్రత్యేక ఆధార్ క్యాంపులు ఏర్పాటు చేసినట్లు ఎంపీడీవో మహబూబ్ దౌలా తెలిపారు. ఎంపీడీఓ కార్యలయంలో ఆయన మాట్లాడుతూ ఆయా గ్రామ సచివాల యాలలో ప్రజలు ఆధార్ అప్డేట్ చేసుకోనేందుకు వీలుగా ఈ ప్రత్యేక క్యాంపులు ఏర్పాటు చేసినట్లు ఆయన వివరించారు.ఈ నెల 22 న మల్లెవేముల,చింతలచెరువు, 23 న శెట్టివీడు,మద్దూరు, 24 న పెద్దబోధనం, నేలంపాడు, ముత్యాలపాడు - 2,చిన్నవంగలి, పెద్దవంగలి, 25 న గొడెగనూరు,డి వనిపెంట, ముత్యాలపాడు-1 సచివాలయాలలో ఆధార్ క్యాంపులు నిర్వహిస్తున్నట్లు ఆయన వివరించారు.

కలప, వెదురు అక్రమ రవాణా

- మామూళ్లతో సరిపెట్టుకుంటున్న ఫారెస్ట్ సిబ్బంది

ప్రజాశక్తి - రుద్రవరం

రుద్రవరం మండలం చెలమ ఫారెస్ట్ రేంజ్ పరిధిలోని పెద్ద కంబలూరు సెక్షన్ నల్లమల అటవీ ప్రాంతం నుంచి కలప, వెదురు అక్రమ రవాణా యదేచ్ఛగా జరుగుతుంది. సంబంధిత ఫారెస్ట్ అధికారులు తమకు కేటాయించిన ఏరియాలలో నివాసం ఉండి అక్కడ నుండి అడవికి సంబంధించిన ఎటువంటి అక్రమ రవాణా జరగకుండా సంరక్షించాల్సి ఉంది. ఫారెస్ట్ సిబ్బంది మాత్రం పట్టణాలలో ఉంటూ చుట్టపు చూపుగా వచ్చి విధులు నిర్వహిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. నల్లమల ప్రాంతం నుంచి టేకు కలపతో పాటు వెదురును సైకిళ్లు, గుర్రాలపై అక్రమంగా రవాణా చేస్తూ కొందరు సొమ్ము చేసుకుంటున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. కొన్ని సందర్భాలలో అక్రమ రవాణా దారులను అదుపులోకు తీసుకొని వారి వద్ద నుంచి కలప, వెదురును, వాటిని తరలిస్తున్న వాహనాలు, జంతువులను సీజ్ చేయకుండా, అపరాధ రుసుం వసూలు చేయకుండా వదిలేస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి. వారి దగ్గర నుంచి నెల మామూలు తీసుకుంటున్నారనే ఆరోపణ కూడా ఉన్నాయి. పెద్దకంబలూరు ఫారెస్ట్ సెక్షన్ పరిధిలో అటవీ సంరక్షణ చేయాల్సిన అధికారులు నంద్యాలలో నివాసముంటు విధులు నిర్వహిస్తూ ఉండడంతో అక్రమ రవాణాతో పాటు ఈ ప్రాంతంలో వన్యప్రాణుల వేట కూడా జరుగుతున్నట్లు సమాచారం. ఫారెస్ట్ ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో కిందిస్థాయి సిబ్బంది ఇష్టానుసారంగా విధులు నిర్వహిస్తూ అడవులను, వణ్యప్రాణులను కాపాడలేక పోతున్నారని ఆయా గ్రామాల ప్రజలు వాపోతున్నారు. జిల్లా ఉన్నత అధికారులు స్పందించి సిబ్బంది కేటాయించిన చోటనే ఉంటూ అడవులను రక్షించేలా చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.





పెద్దకంబలూరు ఫారెస్ట్ పరిధిలో సైకిల్పై కలప తరలిస్తున్న దృశ్యం

టిడిపితోనే రాష్ట్ర భవిష్యత్తు : మాజీ ఎమ్మెల్యే

ప్రజాశక్తి - బనగానపల్లె

టిడిపితోనే రాష్ట్ర భవిష్యత్తు అని, వచ్చే ఎన్నికల్లో పార్టీని గెలిపించాలని మాజీ ఎమ్మెల్యే బిసి జనార్దన్ రెడ్డి పేర్కొన్నారు. సోమవారం మండలంలోని కాపులపల్లి గ్రామంలో మీ భవిష్యత్తుకు భరోసా కొరకు ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్ రెడ్డి పాల్గొన్నారు. గ్రామంలో ఇంటింటికి తిరిగి భవిష్యత్తుకు గ్యారెంటీ బుక్లెట్లను పంపిణీ చేస్తూ టిడిపి అధికారంలోకి వస్తే చేపట్టే సంక్షేమ పథకాలు, అభివృద్ధిని వివరించారు. మాజీ ఎమ్మెల్యేకు గ్రామ సర్పంచ్ తులసిరెడ్డి ఆధ్వర్యంలో పార్టీ నాయకులు కార్యకర్తలు ప్రజలు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పాదయాత్రలో, ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను గాలికి వదిలేశారని విమర్శించారు. సంక్షేమ పథకాలలో జగన్ రెడ్డి కోతలు విధిస్తూ వైసిపి నాయకులకు, కార్యకర్తలకు మాత్రమే సంక్షేమ పథకాలు ఇస్తున్నారని విమర్శించారు. వచ్చే ఎన్నికల్లో వైసీపీ ప్రభుత్వానికి ప్రజలు బుద్ధి చెప్పడానికి సిద్ధంగా ఉన్నారని అన్నారు. రాష్ట్రంలో అరాచక పాలనను అంతంమొందించాలన్నారు. కార్యక్రమంలో పట్టణ ఉపసర్పంచ్ బురానుద్దీన్, ఇల్లూరు కొత్తపేట మాజీ సర్పంచ్ రామిరెడ్డి, మద్దిలేటి రెడ్డి, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



బుక్లెట్లను పంపిణీ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్ రెడ్డి

పూలతో వస్తువుల తయారీపై శిక్షణ

- 28 నుంచి 30 వరకు తాడేపల్లి గూడెంలో ప్రత్యేక శిక్షణ
- డాక్టర్ వైఎస్ఆర్ హెచ్ఆర్ బోర్డు సభ్యులు సప్తశైల సుమిత్ర వెల్లడి

ప్రజాశక్తి-డోన్

ఈనెల 28 నుంచి 30వరకు విజయవాడల తాడెపల్లిగూడెంలో మెప్మాగ్రూపు మహిళలకు పూలతో వస్తువులు తయారు చేసే శిక్షణ ఉచితంగా ఇస్తారని డాక్టర్ వైఎస్ఆర్ హార్టికల్చర్ యూనివర్సిటి బోర్డు సభ్యులు సప్తశైల సుమిత్ర తెలిపారు. సోమవారం డోన్ పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో మెప్మా సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ డ్వాక్రామహిళా నైపుణ్యాభివద్ధి కోసం డాక్టర్ వైఎస్ఆర్హెచ్యు వారికి సబ్బులు, కొవ్వొత్తులు, పూల సువాసనలు, రంగులు... తదితరాలను తయారు చేసేందుకు నైపుణ్యాభివద్ధి బృందం శిక్షణ ఇస్తుందన్నారు. అమ్ముడుపోని పూలను చెత్తకుండీల్లో పడేస్తున్నారు. బదులుగా అవి మిగిలి ఉన్న పువ్వులకు విలువను జోడిస్తాయి. అలాగే దేవాలయాలకు అంకితమైన పుష్పాలను సేకరిస్తారన్నారు. కార్యక్రమం పేరు 'పుష్ప ప్రసాద' ఇది ఇప్పటికే టిటిడిలో నిర్వహిస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మెప్మా టిఎంసి సుజాత , మెప్మా సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. మహిళలలో 10 మంది మహిళలను యూనివర్సిటీకి డైరెక్ట్గా పిలుచుకు పోతామని, ఈనెల 28, 29, 30 మూడు రోజులపాటు ఉచితంగా ట్రైనింగు అకామిడేషన్, ఫుడ్ సౌకర్యం ఫ్రీగా ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. బోర్డు మెంబర్ చెప్పినందుకు వారికి అన్ని ఏర్పాట్లు ఫ్రీగా కల్పిస్తున్నామన్నామని తెలిపారు.



మాట్లాడుతున్న సప్తశైల సుమిత్ర

బానకచర్లలో డెంగ్యూ కేసు నమోదు

ప్రజాశక్తి - పాములపాడు

పాములపాడు మండలం బానకచెర్ల గ్రామంలో ఆరేళ్ల బాలుడు షేక్ షాహిద్కు డెంగ్యూ జ్వరం రావడంతో వైద్యాధికారులు కర్నూల్ జిజిహెచ్కు రెఫర్ చేశారు. మండల వైద్యాధికారిని నాగలక్ష్మి దేవి మాట్లాడుతూ గ్రామంలో ఒక డెంగ్యూ కేసు మాత్రమే పాజిటివ్ వచ్చిందని, ఇంకా ఎవరికీ లేదన్నారు. ఫీవర్ సర్వే నిర్వహించి అందరికీ పరీక్షలు నిర్వహించామన్నారు. ఎలాంటి ఇబ్బంది లేదన్నారు. ఎంపీడీవో గోపికృష్ణ స్పందించి తక్షణమే గ్రామంలో శానిటేషన్ దోమలకు స్ప్రేయింగ్ చేయించాలని పంచాయతీ కార్యదర్శిని ఆదేశించారు. ప్రజలు దోమతెరలు వాడాలని అవగాహన కల్పించారు. ప్రజలు శుద్ధ జల వాటర్ తాగాలని, నీటిని వేడి చేసుకుని చల్లార్చి తాగాలని సూచనలు చేశారు.

విద్యార్థులు జాబ్ ప్రొవైడర్లుగా ఎదగాలి

- గురురాఘవేంద్ర బ్యాంకింగ్ కోచింగ్ సెంటర్ చైర్మన్ పి.దస్తగిరి రెడ్డి
- ఘనంగా ప్రపంచ వ్యవస్థాపకుల దినోత్సవం

ప్రజాశక్తి - నంద్యాల

ప్రపంచ వ్యవస్థాపకుల దినోత్సవాన్ని సోమవారం నంద్యాల పట్టణంలోని శ్రీరామకృష్ణ డిగ్రీ, పీజీ కాలేజీలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా శ్రీ గురు రాఘవేంద్ర బ్యాంకింగ్ కోచింగ్ సెంటర్ చైర్మన్ పి.దస్తగిరి రెడ్డి, స్వగృహ ఫుడ్స్ యజమాని పద్మావతి, స్నేహ వృధాశ్రమం జె.సావిత్రమ్మ, మహిళా పారిశ్రామికవేత్త ఎస్ఎల్.శిరోమణి, తయారీ రంగ పారిశ్రామికవేత్త నాగమణి పాల్గొన్నారు. ముందుగా ఈ కార్యక్రమం కళాశాల విద్యార్థి హేమలత శాస్త్రీయ ప్రదర్శనతో ప్రారంభమైంది. ఈ సందర్భంగా పి.దస్తగిరి రెడ్డి మాట్లాడుతూ ప్రతి విద్యార్థి జాబ్ సీకర్గా కాకుండా జాబ్ ప్రొవైడర్గా ఎదగాలన్నారు. శ్రీ గురు రాఘవేందర్ బ్యాంకింగ్ కోచింగ్ సెంటర్ను ఎలా ప్రారంభించారో వివరించారు. పద్మావతి మాట్లాడుతూ తను 10 వేల రూపాయల నగదుతో పచ్చళ్ళ యూనిట్ను ప్రారంభించి ఈరోజు కోట్ల వ్యాపారం చేయగలుగుతునానని వివరించారు. అంతరం కళాశాల ఛైర్మన్ ప్రొఫెసర్ జి.రామకృష్ణ రెడ్డి మాట్లాడుతూ ప్రతి విద్యార్థి ఒక మంచి పారిశ్రామిక వేత్తగా అభివృద్ధి చెందాలన్నారు. కార్యక్రమంలో ప్రముఖులతో పాటు కళాశాల డైరెక్టర్ డాక్టర్ జి.హేమంత్ రెడ్డి, విజయకుమారి, ఎస్టేట్ మేనేజర్ ప్రగతి రెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పచ్చళ్ల వ్యాపారి పద్మావతి


మాట్లాడుతున్న డిఈఈ రవికాంత్

ఆళ్లగడ్డ సబ్ డివిజన్‌లో విద్యుత్ బకాయిలు రూ.62 కోట్లు : డిఇఇ

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

ఆళ్లగడ్డ విద్యుత్ సబ్ డివిజన్లో రూ. 62 కోట్ల విద్యుత్ బకాయిలు ఉన్నట్లు విద్యుత్ డిఈఈ రవికాంత్ చౌదరి తెలిపారు. స్థానిక కార్యాలయంలో సోమవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వర్షాకాలం కావడంతో రైతులు పొలాల్లోని స్టార్టర్ల వద్ద తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఏదైనా విద్యుత్ సమస్య ఉంటే తమ సిబ్బందికి తెలియజేస్తే పరిష్కరిస్తారన్నారు. ఆళ్లగడ్డ పట్టణంలో విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేసేందుకు ఎలక్ట్రికల్ ఈఈ రమణారెడ్డి 50 లక్షల రూపాయలు మంజూరు చేశారన్నారు. బుధవారం నుండి విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేస్తున్నందువల్ల పది రోజులపాటు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు. సమావేశంలో ఏఈ కంబగిరి ఉన్నారు.

ట్యాంకర్లతో నీటి సరఫరా

ప్రజాశక్తి - పాములపాడు

మండలంలోని భానుముక్కలలో గత 20 రోజుల నుండి పైపులైను డ్యామేజ్ కావడంతో నీటి సరఫరా నిలిచిపోయింది. దీంతో ఎంపీడీవో గోపికృష్ణ ఆదేశాల మేరకు సర్పంచి కృష్ణవేణి, పంచాయతీ కార్యదర్శి నాగార్జున రెడ్డిలు ఎస్సీ కాలనీ, బిసి కాలనీ ప్రజలకు ట్యాంకర్ల ద్వారా సోమవారం నీటిని సరఫరా చేశారు. ఎంపీడీవ్లో మాట్లాడుతూ త్వరలోనే పైపులైను సమస్యను పరిష్కరించి నీటిని సరఫరా చేస్తామన్నారు.

రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో స్పందన అర్జీదారులకు అన్నదానం

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా ప్రెసిడెంట్, కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రతి సోమవారము స్పందన అర్జీదారులకు అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. అందులో భాగంగా సోమవారం రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన అన్నదాన కార్యక్రమాన్ని జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించి స్పందన అర్జిదారులకు ఆహారం పంపిణీ చేశారు. జడ్పీ సీఈవో సుబ్బారెడ్డి,నంద్యాల మున్సి పల్ కమిషనర్ రవిచంద్ర రెడ్డి,రెడ్ క్రాస్ డిఎఫ్ఓ రాజు నాయక్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జెసి రెడ్ క్రాస్‌ను అభినందించారు.


అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న జెసి


భూహక్కు పత్రాల పొందిన రైతులతో ఎమ్మెల్యే, నాయకులు

రైతన్న కష్టాల తొలగింపునకే భూ రక్ష : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - చాగలమర్రి : రైతన్నల కష్టాలను తొలగించాలన్న గొప్ప ఉద్దేశంతోనే ముఖ్యమంత్రి జగనన్న వైఎస్ఆర్ జగనన్న శాశ్వత భూ హక్కు, భూ రక్ష పథకాన్ని రాష్ట్రంలో ప్రవేశపెట్టారని ఆళ్లగడ్డ ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి తెలిపారు. సోమవారం చాగలమర్రిలోని అమ్మవారి శాలలో గ్రామ సర్పంచి తులసమ్మ అధ్యక్షతన చాగలమర్రి, మల్లె వేముల గ్రామాల రైతులకు సర్వే పూర్తి అయిన భూహక్కు పత్రాలను ఆయన అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గతంలో ఏ ప్రభుత్వం కూడా ఇలాంటి కార్యక్రమాన్ని రైతుల కోసం చేపట్ట లేదన్నారు. భారతదేశంలోని ఏ రాష్ట్రంలో కూడా శాశ్వత భూ రక్ష పథకాన్ని అమలు చేయలేదని తెలిపారు. మన రాష్ట్రంలో డ్రోన్‌ల సహాయంతో సంబంధిత రైతుల భూమిని ఖచ్చితంగా నిర్ణయించి హద్దులను ఏర్పాటు చేసి సర్వే రాళ్లను ఏర్పాటు చేశారన్నారు.

వైయస్సార్ జలకళ కింద విద్యుత్ మోటర్లు పంపిణీ

మండలంలోని దస్తగిరి రెడ్డి, సుధామణి, లక్ష్మయ్య, గోన నరసింహ్మారెడ్డి, సుబ్బరాయుడు రైతులకు మంజూరైన ఉచిత విద్యుత్ మోటర్లు పంపుసెట్లను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఒక్కొక్క యూనిట్ విలువ రూ 3.93 లక్షలని తెలిపారు. ఈ అవకాశాన్ని సన్న, చిన్నకారు రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వైసీపీ మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి షేక్ బాబులాల్, మండల కన్వీనర్ కుమార్ రెడ్డి, మండల అధ్యక్షుడు వీరభద్రుడు, ఉప మండల అధ్యక్షుడు ముల్లా రఫీ, ఎంపీటీసీలు పత్తి నారాయణ, ఫయాజ్, లక్ష్మిరెడ్డి, మండల కోఆప్షన్ సభ్యుడు జిగ్గి గారి ఇబ్రహీం, సింగిల్ విండో అధ్యక్షుడు దస్తగిరి, మార్కెట్ యార్డ్ డైరెక్టర్ ముల్లా జాబిర్, నాయకులు గణేష్ రెడ్డి, జగదీశ్వర్ రెడ్డి, శేషు రమేష్ , అబ్దుల్లా భాష, ఆర్ఎస్ రమణ, ముల్లా ఖాదర్బాషా, వెంకటరమణ, బచ్చు సుబ్రహ్మణ్యం, ఐడియా బాబు, నాగేంద్ర, రాంపల్లె రామకృష్ణ, నరసింహ, తహసిల్దార్ సుభద్రమ్మ, డీటీలు విజయ్ కుమార్, శ్రీనివాస్ రెడ్డి, ఎంపీడీవో మహబూబ్ దౌలా, ఇఓఆర్డి సుదర్శన్ రావు, ఏపీడి సాంబశివుడు, ఏపీవో నిర్మల, వీఆర్వోలు శ్రీనివాసులు, వెంకటరామిరెడ్డి, శారద, విశ్వనాథ్, సర్పంచులు పాల్గొన్నారు.

రూరల్ సిఐకు పాత్రికేయులు సన్మానం

ప్రజాశక్తి - నందికొట్కూరు : నందికొట్కూరు రూరల్ సిఐగా బాధ్యతలు చేపట్టిన విజయ భాస్కర్‌ను స్థానిక పాత్రికేయులు సోమవారం దుశ్శాలువాతో ఘనంగా సన్మానించి, శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో పాత్రికేయులు జయరాజు, గోపి, స్వామన్న, ఖలీల్, నాయక్, స్వామన్న, ఉమ్మర్ బాషా, అబ్దుల్లా తదితరులు పాల్గొన్నారు.


సిఐను సన్మానిస్తున్న పాత్రికేయులు

ప్రజా సంక్షేమం కోసమే గడపగడపకు : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - నంద్యాల రూరల్

ప్రజా సంక్షేమం కోసమే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం చేపడుతున్నట్లు ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి తెలిపారు. సోమవారం నంద్యాల మున్సిపాలిటీ పరిధిలోని 38వ వార్డు వైఎస్ఆర్ నగర్‌లో వార్డు ఇన్చార్జి టీవీ రమణ కౌన్సిలర్ సావిత్రమ్మ ఆధ్వర్యంలో 137వరోజు గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎంతో ధృఢ సంకల్పంతో రాష్ట్ర అభివృద్ధి కోసం ప్రవేశపెట్టిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ప్రజాధరణ పొందుతున్నదని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మాబున్నిసా, ఆప్కో డైరెక్టర్ సుబ్బారాయుడు, మున్సిపల్ వైస్ చైర్మన్ పామ్‌షావలి, వైసిపి నాయకులు అంకాలయ్య, బాబురావు, నరసింహరావు శెట్టి ,తిరుపతయ్య, జాకీర్ హుస్సేన్, అన్వర్ భాష, రామకృష్ణారెడ్డి, ప్రసాద్ రెడ్డి, పుల్లమ్మ, వెంకటస్వామి శెట్టి, ఆచారి, రాము, ఉమాకాంతయ్య, బాబు, చిరు, సోమశేఖర్, శివ, గోరే, ముర్తుజా, చెన్నప్ప, వార్డు సచివాలయ సిబ్బంది, వాలంటరీలు పాల్గొన్నారు. **పాణ్యం:** సంక్షేమ ఫలాలు ప్రతి ఒక్కరికీ ఒందేలా చూడడమే జగన్ ప్రభుత్వ లక్ష్యమని పాణ్యం శాసన సభ్యులు కాటసాని రాంభూపాల్ రెడ్డి అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా కొనిదేడు గ్రామంలో ఆయన పర్యటించారు. వచ్చే ఎన్నికల్లో మళ్ళీ వైసిపికి ప్రజలు పట్టం కడతారాని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వైసిపి నేతలు, అధికారులు పాల్గొన్నారు.


సంక్షేమ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే శిల్పా

ప్రజా క్షేత్రంలో తేల్చుకుందాం..

- ఒక్కరు వస్తారా..? వందమంది వస్తారో తేల్చుకోండి..
- ఛాలెంజ్ విసిరిన ఎమ్మెల్యే శిల్పా రవి చంద్ర కిషోర్ రెడ్డి

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

'ప్రజా క్షేత్రంలో తేల్చుకుందాం.. ఒక్కరు వస్తారా లేక వందమంది వస్తారో తేల్చుకోండి..' అని ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి ప్రతిపక్షాలకు ఛాలెంజ్ విసిరారు. తాజాగా రాష్ట్రంలో జరిగిన ఉప ఎన్నికల్లో వైసిపి జెండా ఎగురవేసిందని, ప్రజల్లో తమ సత్తా మరోసారి నిరూపించామని తెలిపారు. తసోమవారం స్థానిక కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. రానున్న ఎన్నికల్లో ప్రజా తీర్పు వైసిపికే వస్తుందని ఈ ఉప ఎన్నికలు నిరూపించాయన్నారు. 66 సర్పంచి ఎన్నికల్లో 30 ఏకగ్రీవం, 36 స్థానాల్లో 23 వైసిపి బలపరిచిన అభ్యర్థులు విజయం సాధించారన్నారు. లోకేష్, పవన్ కళ్యాణ్ పాదయాత్రలు వైసీపీ గెలుపును నిలువరించలేవని నిరూపితం అయ్యాయన్నారు. ప్రతిపక్ష నాయకులు ఉన్న కీలక ప్రాంతాలైన కుప్పంలో 6 స్థానాల్లో 5 వైసిపి కైవసం చేసుకుందన్నారు. జెసి అడ్డాలో వైసిపి జెండా ఎగురవేశామన్నారు. ప్రజాక్షేత్రంలో ఓటరు ఎవరికీ భయపడరని, నచ్చిన వారికి వేస్తారన్నారు. రానున్న ఎన్నికల్లో వైసిపి ప్రభంజనం కొనసాగుతుందని ధీమా వ్యక్తం చేశారు. నంద్యాల జిల్లాలో 19 స్థానాల్లో ఎన్నికలు జరిగితే 16 వైసిపి విజయం సాధించిందన్నారు. కేవలం 3 స్థానాల్లో టిడిపి గెలిచిందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మాబున్నీసా, మార్కెట్ యార్డు చైర్మన్ మహేశ్వరరెడ్డి, బెస్త సంఘం డైరెక్టర్ చంద్రశేఖరరెడ్డి, వైస్ చైర్మన్ పాషావలి, ఆప్కో డైరెక్టర్ సుబ్బరాయుడు, వైసిపి నాయకుడు నందంబాబురావు తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే


రాజీనామా పత్రాలను ఎంపీడీఓకు అందజేస్తున్న వార్డు సభ్యులు

నలుగురు వార్డు సభ్యులు రాజీనామా

ప్రజాశక్తి - చాగలమర్రి

మండలంలోని బ్రాహ్మణపల్లె గ్రామానికి చెందిన 2వ వార్డు సభ్యురాలు, ఉప సర్పంచ్ సుబ్బలక్షుమ్మ, 1వ వార్డు సభ్యురాలు అనురాధ, 6వ వార్డు సభ్యురాలు సుధారాణి, 8వ వార్డు సభ్యురాలు స్వర్ణలతలు తమ రాజీనామా పత్రాలను ఎంపిడీఓ మహబూబ్ దౌలాకు సోమవారం అందజేసారు. ఇటీవలే 5వ వార్డుకు ఉప ఎన్నిక జరిగింది. వార్డు సభ్యులు మాట్లాడుతూ వ్యక్తిగత కారణాల వల్లే రాజీనామా చేసినట్లు తెలియజేసారు. అయితే గ్రామంలో వైసిపి ఆధిపత్య పోరు వల్లే రాజీనామా చేసినట్లు పలువురు చర్చించుకుంటున్నారు.

ఇరిగెలను కలిసిన మాజీ మంత్రి శిల్పా

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

ఆళ్లగడ్డ పట్టణంలోని శ్రీనివాస్ నగర్‌లో ఉన్న ఇరిగెల బ్రదర్స్ కార్యాలయంలో ఇరిగెలను మాజీ మంత్రి శిల్పా మోహన్ రెడ్డి, ఎమ్మెల్సీ ఇస్సాక్ భాష, ముస్లిం మైనార్టీ నాయకులు అమీర్, నాగేశ్వర్ రెడ్డి తదితరులు సోమవారం కలిశారు. తాజా రాజకీయ పరిస్థితులపై ఆళ్లగడ్డ తాలూకా సీనియర్ నాయకులు ఇరిగెల సూర్యనారాయణ రెడ్డితో వారు చర్చించారు.



23న ధర్నాను జయప్రదం చేయండి

- ఎపిటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి నగిరి శ్రీనివాసులు

ప్రజాశక్తి - గడివేముల

విద్య, ఉపాధ్యాయ రంగంలో దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఫ్యాప్టో రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 23న విజయవాడలోని విద్యాశాఖ కమిషనర్ కార్యాలయం ఎదుట చేపడుతున్న 12 గంటల ధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఏపిటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి నగిరి శ్రీనివాసులు ఉపాధ్యాయులకు పిలుపునిచ్చారు. సోమవారం మండలంలోని గడిగరేవుల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన ఉపాధ్యాయుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి ఇచ్చిన హామీ మేరకు సిపిఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. జూన్‌లో బదిలీలు, ప్రమోషన్లు పొందిన 50 వేల మంది ఉపాధ్యాయులకు మూడు నెలల నుండి జీతాలు లేవని, వారు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారని, తక్షణమే జీతాలు చెల్లించాలన్నారు. ప్రస్తుతం జరుగుతున్న అసబద్ధమైన సర్దుబాటు ప్రక్రియను నిలుపుదల చేయాలన్నారు. ప్రాథమిక పాఠశాల విద్యను సర్వనాశనం చేస్తున్న జీవో 117ను తక్షణమే రద్దు చేసి ప్రాథమిక పాఠశాలలను కాపాడాలని, ఆదర్శ పాఠశాలల ఉపాధ్యాయులకు 010 పద్దు కింద జీతాలు చెల్లించాలని , వారికి పదోన్నతులు, హెల్త్ కార్డ్స్ ఇవ్వాలన్నారు. కస్తూర్బా పాఠశాలలో పనిచేసే ఉపాధ్యాయులకు మినిమం టైమ్స్ స్కేల్ ఇవ్వాలని కోరారు. దీర్ఘకాలంగా పెండింగ్ లో ఉన్న జడ్పీ పిఎఫ్, ఎపిజిఎల్ఐ లోన్లు, సరెండర్ బిల్లులను వెంటనే చెల్లించాలని, బోధ నేతర పనుల నుండి ఉపాధ్యాయులకు మినహాయింపు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఫ్యాప్టో నాయకులు బి.రాంపుల్లారెడ్డి, మారెన్న, ప్రతాపరెడ్డి, శ్రీరాములు, బాలస్వామి, మల్లికార్జున, చంద్రావతి , పుష్పకుమారి, కవిత, ఆదిశేషమ్మ, లక్ష్మీదేవి, హరిత తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి నగిరి శ్రీనివాసులు

అర్హులైన విఆర్ఎలకు పథకాలు వర్తింపజేయాలి

ప్రజాశక్తి - కొత్తపల్లి

గ్రామాల్లో పని చేస్తున్న అర్హులైన విఆర్ఏలకు ప్రభుత్వ పథకాలు వర్తింపజేయడంతో పాటు ప్రతి వీఆర్ఏకు ఇంటి స్థలాలు ఇవ్వాలని విఆర్ఏల సంఘం జిల్లా అధ్యక్షులు నాగేష్, మండల అధ్యక్షులు రవికుమార్, కార్యదర్శి మియ్యాసా డిమాండ్ చేశారు. సోమవారం కొత్తపల్లిలో వీఆర్ఏలతో కలిసి ర్యాలీ నిర్వహించి స్థానిక తహసిల్దార్ కార్యాలయంలో తహసిల్దార్ చంద్రశేఖర్ నాయక్, డిప్యూటీ తహసిల్దార్ పెద్దన్నకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి వీఆర్ఏలకు పాదయాత్ర సమయంలో ఇచ్చిన మాటను నెరవేర్చాలన్నారు. గ్రామాల్లో చాలీచాలని జీతాలతో పని చేస్తున్న విఆర్ఏల సమస్యలపై ప్రభుత్వం వెంటనే స్పందించి పరిష్కరించా లన్నారు. కార్యక్రమంలో విఆర్ఏలు చెన్నయ్య, పుల్లయ్య, స్వాములు తదితరులు పాల్గొన్నారు.


తహసిల్దార్ కు వినతి పత్రం ఇస్తున్న దృశ్యం

సమయపాలన పాటించని పశు వైద్యులు

ప్రజాశక్తి - నంద్యాల రూరల్.

నంద్యాల మండల పరిధిలోని పులిమద్ది గ్రామంలోని పశు వైద్యశాలకు సోమవారం 12 గంటలకే తాళం వేసి వెళ్లిపోయారు. పని చేయు వేళలు ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు అని బోర్డు మాత్రం తగిలించారు. కానీ ఆచరణలో... మాత్రం అది అమలు కావడం లేదు. వైద్యం కోసం వైద్యశాలకు పశువులతో వచ్చిన వారు తాళం వేయడాన్ని చూసి అసహనంతో వెనుతిరిగి వెళ్తున్నారు. గ్రామలలో పశు వైద్య సేవలు నిరంతరం అందుబాటులోఉండాలని, పశువులకు వైద్యం అవసరమైతే పశు పోషకులు ఎప్పుడు ఫోన్ చేసినా వచ్చి వైద్యం అందించేలా పశు వైద్యులు అందుబాటులో ఉండాలి. కానీ అలా కాకుండా పశు వైద్యులు ఎప్పుడు వస్తారో , ఎప్పుడు వెళ్తారో తెలియని పరిస్థితి నెలకొంది. పశు వైద్యులు సమయపాలన పాటించక పోడంతో పశువులకు తగిన సమయంలో వైద్యం అందక ఇబ్బందులు పడుతున్నామని పశు పోషకులు వాపోతున్నారు.


తాళం వేసిన పశు వైద్యశాల


బిజెపిలోకి వైసిపి నాయకులు సింగం భరత్ రెడ్డి

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

వైసిపి పట్టణ అధ్యక్షులు సింగం భరత్ రెడ్డి బిజెపి తీర్థం పుచ్చుకున్నారు. సోమవారం భూమా కిషోర్ రెడ్డి ఇంటికి సింగం భరత్ రెడ్డి ఆయన తల్లి సింగం వెంకటసుబ్బమ్మతోపాటు పలువురు వెళ్లి బిజెపి కండువా కప్పుకున్నారు. ఈ సందర్భంగా భూమా కిషోర్ రెడ్డి మాట్లాడుతూ ఆళ్లగడ్డ పట్టణంలో ఎమ్మెల్యే గంగుల నాని అభివృద్ధి చేసింది ఆయన ఇంటికి వెళ్లేదారిని అందంగా తీర్చిదిద్దుకోడమేనని ఆరోపించారు. మున్సిపాలిటీలో నిధులు ఉన్నా చైర్మన్ మొండిపట్టుతో నిధులను సక్రమంగా వినియోగించుకోలేకపోయారన్నారు. డాక్టర్ వృత్తిలో రాణించిన మున్సిపల్ చైర్మన్ అభివృద్ధికి పాటుపడకపోవడం బాధాకరమన్నారు. తవైసిపి హయాంలో అభివృద్ధి జరగలేదని ఆ పార్టీకి చెందిన పట్టణ అధ్యక్షులు సింగం భరత్ రెడ్డి పార్టీని వీడి బిజెపిలోకి రావడం హర్షనీయమన్నారు. సింగం భరత్ రెడ్డి మాట్లాడుతూ గంగుల కుటుంబానికి ఎంతో సేవ చేశామన్నారు. గంగుల నాని 2019లో ఎమ్మెల్యే అయ్యాక ఆయనకు ధన దాహం పెరిగిందన్నారు. అబద్దాలను నమ్ముతున్నారన్నారు. నిజాయితీని గుర్తించడం లేదని, విలువ ఇవ్వడం లేదన్నారు. రాబోయే రోజుల్లో మరికొందరు బిజెపిలోకి చేరుతారన్నారు. మంత్రులుగా, ఎమ్మెల్యేలుగా ఉండి ఆళ్లగడ్డ నియోజక వర్గానికి ఎవరు ఏమీ చేయలేదని ఆరోపించారు. కార్యక్రమంలో నాయకులు అంబటి మహేశ్వర్ రెడ్డి, హుస్సేన్ రెడ్డి, సర్వాయి పల్లె రాజా తదితరులు పాల్గొన్నారు.


భూమా కిషోర్ రెడ్డికి పుష్పగుచ్ఛం ఇస్తున్న సింగం భరత్ రెడ్డి, సింగం వెంకటసుబ్బమ్మ

ప్రజాభిమానంతోనే 2 వార్డులను గెలుచుకున్నాం



- ఎంపిపి బుగ్గన నాగభూషణం రెడ్డి, చైర్మన్ చలం రెడ్డి

ప్రజాశక్తి - బేతంచెర్ల

రాష్ట్ర ముఖ్యమంత్రి వైస్ జగన్మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన పలు సంక్షేమ పథకాలు, ప్రజల ఆదరాభిమానాలతోనే ఎం పెండకల్, రహిమాన్‌పురం గ్రామాలలో రెండు వార్డు స్థానాలను వైసిపి గెలుచుకుందని ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి, నగర పంచాయతీ చైర్మన్ సిహెచ్ చలం రెడ్డి , మద్దిలేటి స్వామి ఆలయ చైర్మన్ బిఎస్ రామచంద్రుడు అన్నారు. సోమవారం పట్టణంలోని వైసిపి కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎం పెండకల్ పరిధిలోని మజార గ్రామమైన వెంకటగిరి 10వ వార్డు ఎం. వేణుగోపాల్ రెడ్డి, రహిమాన్ పురం 6వ వార్డు మెంబర్ బి.ప్రసాద్‌లను ప్రజలు గెలిపించారన్నారు. అంబాపురం వార్డు మెంబర్‌గా ఉన్న ఎర్రమల మరణించడంతో గ్రామ పెద్దలు, ప్రజల అంగీకారంతో ఆయన భార్య చిన్న మద్దమ్మను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారని చెప్పారు. కార్యక్రమంలో నాయకులు గూని నాగరాజు, గోరుమానుకొండ సర్పంచ్ కోడే వెంకటేశ్వర్లు, బీరెళి నాగేష్ రెడ్డి, తిరుమలేశ్వర్ రెడ్డి, మురళీధర్ రెడ్డి, తిరుమలేష్ రెడ్డి, మురళీకృష్ణ పాల్గొన్నారు.